

మెయిన్‌లో..

నాటు తుపాకితో ప్రియురాలు, ఆమె భర్తపై కాల్పులు

ఆటో బోల్తా..
- ఏడుగురు విద్యార్థులకు గాయాలు
- తుని మండలం హంసవరంలో ఘటన

7

దొంగలు దర్జాగా..





- కాకినాడలో టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై చర్యలేవి
- విజిలెన్స్ విచారణలో నాటి వైసీపీ కీలక నేత బండారం బద్దలు
- ప్రభుత్వానికి చేరిన విజిలెన్స్ అధికారుల నివేదిక: అయినా చర్యలకు మీనమేషాలే
- గత వైసీపీ హయాంలో అడ్డగోలుగా రూ.411కోట్ల విలువైన బాండ్ల జారీ
- తెరవెనుక చక్రం తిప్పిన అప్పటి వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ కార్పొరేషన్‌లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జారీచేసిన రూ.411కోట్ల విలువైన టీడీఆర్ బాండ్ల జారీ కుంభకోణంపై బాధ్యులపై చర్యలకు తీవ్ర జాప్యం జరుగుతోంది. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఇప్పటికే కుంభకోణంపై విజిలెన్స్ విచారణ జరిగి ప్రభుత్వానికి నివేదిక వెళ్లింది. ఇది జరిగి నెలలు గడుస్తున్నా అక్రమార్కులపై కనీసం చర్యలు ఉండడంలేదు. నివేదికలో అప్పటి వైసీపీ కీలకనేత, ఆయనకు సహకరించిన కొందరు అధికారులు ఏస్థాయిలో అడ్డగోలుగా వ్యవహరించారో తేలింది. బాధ్యులు టీడీఆర్ బాండ్ల జారీతో కార్పొరేషన్ ఆదాయానికి కోట్లలో గండికొట్టారని తేల్చింది. ఎన్నో స్థలాలున్నా కేవలం కొందరికి లబ్ధి చేకూ ర్చడం కోసమే టీడీఆర్‌నాటకం ఆడారని తేలిపోయింది. ఇవన్నీ కూలంకషంగా ప్రభుత్వానికి అందిన నివేదికలో ఉన్నాయి. అయినా ఇప్పటి వరకు నివేదిక ఆధారంగా చర్యలకు ఉపక్రమించే చిన్న పురోగతి కూడా లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నాడంతా అడ్డగోలే..

గత ప్రభుత్వ హయాంలో కాకినాడ కార్పొరేషన్‌ను వైసీపీ నేతలు పూర్తిగా దోచేశారు. తాము కోట్లలో సంపాదించుకోవడానికి స్కెచ్ వేసుకుని టీడీఆర్ బాండ్లను అడ్డం పెట్టుకున్నారు.చేతిలో అధికారం ఉండడంతో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి తనకు నచ్చినట్లు బాండ్లకు విలువ కట్టించుకున్నారు. ఇందులోభాగంగా ఎన్నికలకు రెండేళ్ల ముందు కాకినాడ కార్పొరేషన్ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కి ద్వారంపూడి ఆదేశాలతో ఏకంగా రూ.411కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లు జారీ చేసేశారు. ముఖ్యంగా కాకినాడ సురేష్‌నగర్ పార్కు వ్యవహారంలో రూ.160కోట్ల వరకు అడ్డగోలుగా టీడీఆర్ బాండ్లు జారీ చేసేశారు. వాస్తవానికి ఈ పార్కు పూర్తిగా ప్రభుత్వ స్థలం. దీనిలో పార్కు అభివృద్ధికి కార్పొరేషన్ నిధులు కూడా వెచ్చించింది. కానీ పార్కు స్థలం తనది అంటూ ఓ వ్యక్తి దొంగ డాక్యుమెంట్లు సృష్టించాడు. తన స్థలంలో పార్కు ఎలా నిర్మిస్తారంటూ అధికారులను బెదిరించాడు. ఇంతలో ద్వారంపూడి జోక్యం చేసుకున్నారు. తతంగం నడిపి భారీగా డబ్బులు కొట్టేశారు. ఇందులో భాగంగా పార్కు స్థలం తనది అని నకిలీ పత్రాలు సృష్టించిన వ్యక్తికి అండగా నిలబడ్డారు. ఈ స్థలాన్ని తిరిగి కార్పొరేషన్ పార్కు కోసం తీసుకోవడానికి సమ్మతించేలా చేసి ఆ స్థలానికి ధర కట్టించారు. ఆ మొత్తాన్ని నగదుకు బదులు టీడీఆర్ బాండ్ల రూపంలో జారీ చేశారు. అంటే ప్రభుత్వ భూమిని ప్రభుత్వమే ప్రైవేటు వ్యక్తికి డబ్బులిచ్చి కొనుగోలు చేసినట్లయింది.

రెండో కుంభకోణం..

రెండోకుంభకోణం కాకినాడ నగరానికి సమీపంలో దుమ్ములపేటలో చోటుచేసుకుంది. ఇక్కడ పరిశ్రమల అవసరాలకోసం ఓ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించాలని ట్రాన్స్‌కో నిర్ణయించింది. దీనికి అవసరమయ్యే స్థలం చాలా తక్కువ. పైగా ఈ స్థలాన్ని ట్రాన్స్‌కో స్వయంగా సమకూర్చుకోవాలి. లేదంటే పక్కనే ఉన్న పోర్టుభూములు కావాలని కలెక్టర్‌ను కోరాలి. కానీ దుమ్ములపేటలో ఓప్రైవేటువ్యక్తికి ఉన్న భూమికి కోట్లలో లాభం వచ్చేలా చేయడానికి అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి రంగంలోకి దిగారు. విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి సంబంధం లేని కార్పొరేషన్‌ను రంగంలోకి దించారు. దీనిద్వారా ప్రభుత్వ స్థలానికి బదులు తనకు కావాల్సిన వ్యక్తి ప్రైవేటు భూమి సేకరించేలా అధికారులపై ఒత్తిడి తెచ్చాడు. దుమ్ములపేటలో 4.67ఎకరాల ప్రైవేటు భూమిని సేకరించారు. గజం రూ.28వేల మార్కెట్ ధర చొప్పున 1:4నిష్పత్తిలో రూ.251కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లను సదరు ప్రైవేటు వ్యక్తికి జారీ చేసేశారు. ఓ ప్రైవేటు వ్యక్తి భూమికి మేలు చేకూర్చి భారీగా సదరు నేత తెర వెనుక డబ్బులు గుంజేశారు. ఈ అడ్డగోలు అక్రమాలపై అప్పట్లో ప్రతిపక్ష టీడీపీ పోరాటం చేసింది. కొండబాబు ఆధ్వర్యంలో ఆందోళనబాట పట్టింది. కానీ అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

నేడు విజిలెన్స్ నివేదిక వచ్చినా..

గతేడాది ప్రభుత్వం మారడంతో టీడీఆర్ కుంభకోణం గుట్టు వీడుతుందని భావించారు. కానీ ఉన్నతాధికారులు కనీసం దృష్టిపెట్టలేదు. అదేసమయంలో పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకులోరూ.700కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లను గత ప్రభుత్వ హయాంలో అధికారులు జారీ చేశారు. దీనివెనుక కుంభకోణం జరిగిందని నిర్ధారించిన ప్రభుత్వం వీటి విలువను భారీగా కుదించాలని గతేడాది నిర్ణయించింది. దీని వెనుక ఎవరెవరున్నారనే దానిపైనా విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో కాకినాడ టీడీఆర్ బాండ్లపైనా విచారణకు అడుగులు పడ్డాయి. కార్పొరేషన్ పరిధిలో రూ.411కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లను అధికారులు ఎలా అడ్డగోలుగా జారీచేశారు? దీనివెనుక అప్పటివైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి ఎలా చక్రం తిప్పారు? అనేదానిపై గతేడాది ఆఖరులో సీఎం చంద్రబాబును కలిసి కాకినాడసిటీ టీడీపీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు వివరించారు. పక్కా ఆధారాలతో వివరాలు అందించారు.దీనిపై విచారణ చేపట్టి బాండ్ల కుంభకోణం నిగ్గుతేల్చాలని కోరారు. దీంతో సీఎం ప్రధాన కార్యదర్శి అయిన ముద్దాడ రవిచంద్రను పిలిపించి ఈ కుంభకోణం సంగతితేల్చాలని చంద్రబాబు ఆదేశించారు. ఈనేపథ్యంలో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి లోతుగా టీడీఆర్ స్కాంపై విచారణ జరిపారు. వీటిని జారీ చేయడం వెనుక జరిగిన తంతంగాన్ని మొత్తం కూలంకషంగా వెలికితీశారు. సురేష్‌నగర్ పార్కుస్థలం ప్రభుత్వానిది అయినా ఒత్తిళ్లకు లొంగి అధికారులు ఎవరెవరు ఎలా సహకరించారనేది విశ్లేషించారు. నివేదిక ప్రభుత్వానికి వెళ్లి నెలలు గడుస్తున్నా అక్రమార్కులపై చర్యలులేవు. అదే వైసీపీహయాంలో కరప మండలం అరట్లకట్ట చెరువు పూడికతీత, మడఅడవుల చదును, ఈట్ స్ట్రీట్ వ్యవహారంలో కొందరు అధికారులపై విచారణకు ఆదేశించింది. అంతకంటే కీలకమైన టీడీఆర్ బాండ్ల సూత్రధారులపై దృష్టిపెట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ స్థలాలపై భూచోళ్లు



కలెక్టర్‌కు వినతిపత్రం అందించి మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే వనమాడి

- తప్పుడు రిజిస్ట్రేషన్లతో స్థలాలు కబ్జా
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భూములకు నకిలీ దస్తావేజులు
- గత ప్రభుత్వ హయాంలో సృష్టి
- అమాయకులకు అంటగట్టే ప్రయత్నం
- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే వనమాడి వినతి

కాకినాడ,ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భూములకు తప్పుడు రిజిస్ట్రేషన్లతో తప్పుడు దస్తావేజులు సృష్టించి అమాయక ప్రజలకు అంటగట్టేందుకు ప్రయత్నించిన ముఠా.. కూటమి ప్రభుత్వంలోనూ అవే తప్పుడు పత్రాలతో తిరుగుతోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు వెల్లడించారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి చీడిలపొర, పోర్టు పరిసర ప్రాంతాల్లో రూ.కోట్లు విలువజేసే ప్రభుత్వ భూములకు తప్పుడు పత్రాలు సృష్టించి, రెవెన్యూ, రిజిస్టర్ కార్యాలయాల్లో తప్పుడు సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించి ఆ దస్తావేజులను బయట తిప్పుతూ అమాయక ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చీడిలపొరలోని సర్వే నెంబర్ 112, 182, 199/6/1లో 50 ఎకరాల భూమిని, కాకినాడఆర్డీవో కేశిన అమ్మిరాజు, గంటి గన్నయ్య, ఎం.సత్యనారాయణ, పోలిశెట్టి వెంకటరమణలకు నిరభ్యంతర పత్రం ఇచ్చినట్టుగా తప్పుడు దస్తావేజులు సృష్టించి, చీడిలపొరలోని ప్రభుత్వ పోరంబోకు, జిరాయితీ భూములను చూపి బయట వ్యక్తులకు అమ్మడానికి ప్రయత్నిస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు.

ఒకే స్థలానికి రెండు దస్తావేజులు

కాకినాడ పోర్టుకు సంబంధించి ఆర్ఎస్ నెంబర్ 364/2, ఆర్ఎస్ నెం: 2004, 79 ఎకరాల భూమికి రెండు పార్టీలకు చెందినదిగా అందులో ఒకరు బెంగళూరుకు చెందిన వ్యక్తిదిగా దస్తావేజు సృష్టించారని, మరికొంతమంది వారికి చెందినదిగా మరొక దస్తావేజు సృష్టించారని ఒకే స్థలానికి విడివిడిగా రెండు దస్తావేజులు సృష్టించారన్నారు. సాంబమూర్తి నగర్‌లోని కేంద్రప్రభుత్వ భూములను చదును చేసి ప్రైవేటు జిరాయితీ భూములుగా సర్వేనెంబర్లు మార్చి లేఅవుట్లు వేశారన్నారు. అనంతరం ఎమ్మెల్యే వనమాడి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసిన కొంతమంది అధికారుల అండదండలతో తప్పుడు సర్వే నెంబర్లతో పత్రాలు తారుమారు చేసి వేర్వేరుచోట్ల రిజిస్ట్రార్‌ఆఫీసుల్లో తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించడమే కాకుండా వాటిని సామాన్యులకు అంటగట్టేందుకు ఓ ముఠా ప్రయత్నిస్తోందన్నారు. చీడిలపొర, పోర్టు పరిసర ప్రాంతాలు, సాంబమూర్తినగర్‌లోని కేంద్రప్రభుత్వ భూములను తప్పుడు పత్రాలతో విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకుని తప్పుడు దస్తావేజులను వెంటనే రద్దు చేసి వాటిని ఇల్లు లేని నిరుపేదలకు స్థలాలుగా ఇప్పించే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

‘ఫోస్టర్ కేర్’ గోడపత్రిక ఆవిష్కరణ



ఫోస్టర్‌కేర్ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన ఫోస్టర్ కేర్(తాత్కాలిక దత్తత)గోడ పత్రికను కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ షాన్‌మోహన్ ఆవిష్కరించారు. జిల్లా స్త్రీశిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలులేని తల్లిదండ్రులుగానీ, పిల్లలు ఉండి ఇంకా పిల్లలను పోషించే సామర్థ్యం ఉన్నవారు గానీ ఫోస్టర్‌కేర్ ద్వారా రెండేళ్లపాటు తాత్కాలికంగా దత్తత తీసుకోవచ్చునన్నారు.నిబంధనల ప్రకారం ఫోస్టర్ కేర్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలా దత్తత తీసుకున్న వారు పిల్లలను ప్రేమతో కూడిన వాతావరణంలో పెంచాలన్నారు. వారి విద్య,ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి, జిల్లా స్కీమ్స్ కోఆర్డినేటర్ మాధవి, జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు, డీఎంహెచ్‌వో నరసింహనాయక్, అధికారులు శ్రీనివాసరావు, వెంకట్రావు, విజయ పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మనక్-2025 గోడపత్రిక ఆవిష్కరణ



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న డీఈవో పిల్లి రమేష్

కాకినాడరూరల్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ మనక్-2025 గోడ పత్రికను డీఈవో పిల్లి రమేష్ సోమవారం ఆయన ఛాంబర్లో ఆవిష్కరించినట్లు జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ తెలిపారు.డీఈవో మాట్లాడుతూ ప్రతిఏటా మాదిరిగానే ఈఏడాది కూడా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలనుంచి తప్పనిసరిగా విద్యార్థులను నామినేట్ చేయాలని, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలనుంచి 3, ఉన్నతపాఠశాలలనుంచి 5, ప్లస్ 1,ప్లస్ 2, పాఠశాలల సైన్స్ విద్యార్థులనుంచి 2 నామినేషన్లు సెప్టెంబర్ 15లోపు పంపించాలన్నారు.డీసీఈబీకార్యదర్శి వెంకట్రావు, ఏడీ షరీఫ్, ఎంఈవో సత్యనారాయణ, సూపరింటెండెంట్ పెండెం ప్రకాష్, హ్యాండ్ రైటింగ్ సమన్వయకర్త అబ్రహంహన్స్ పాల్గొనగావివరాలకు 9912788333 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలని వైసీపీ నిరసన



కాకినాడ కలెక్టరేట్ వద్ద విలేకర్లతో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల సమస్యలను పరిష్కరించాలని వైసీపీ జిల్లాఅధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా దాడిశెట్టిరాజా మాట్లాడుతూజిల్లాలో రైతులు ఎరువులు,విత్తనాల కొరతతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటి సరఫరాలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందన్నారు. యూరియా కొరత తీవ్రంగా ఉందన్నారు. డిప్యూటీ సీఎం సొంత నియోజకవర్గం పిఠాపురంలో కనీసం కాలువలకు పడిన గండ్లను పూడ్చలేకపోయారని ధ్వజమెత్తారు. పంటలకు మద్దతు ధరలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వైసీపీ నేతలు ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, వంగా గీత, తోట నరసింహం, దొరబాబు పాల్గొన్నారు.

రిజర్వు ఫారెస్టు సరిహద్దును పరిశీలించిన డీఎఫ్‌వో



రిజర్వు ఫారెస్టు సరిహద్దును పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

రౌతులపూడి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా శివారు సిరిపురంవద్ద రిజర్వు ఫారెస్టు సరిహద్దును డీఎఫ్‌వో శ్రీనివాసరావు పరిశీలించారు. కాకినాడ, అల్లూరి జిల్లాల మధ్య ఈ సరిహద్దు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రౌతులపూడిలోని ఫారెస్టుకార్యాలయంలో రికార్డులు పరిశీలించారు.రేంజర్‌రాంప్రసాద్, ఎఫ్ఎస్‌వోశ్యామ్ పాల్గొన్నారు.

ఆర్మీ నియామక ర్యాలీ ఏర్పాట్లను పరిశీలించిన జేసీ



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న జేసీ

కార్పొరేషన్(కాకినాడ),ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా మైదానం వేదికగా జరగనున్న ఆర్మీ నియామక ర్యాలీకి సంబంధించిన ఏర్పాట్లను జేసీ రాహుల్ మీనా సోమవారం ఆర్మీ, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. అభ్యర్థుల ప్రవేశం, లైటింగ్, భోజనం వంటి ఏర్పాట్లు పరిశీలన చేశారు. అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ 15వ ఇండియన్ హాకీ జూనియర్ మహిళ జాతీయచాంపియన్‌షిప్ -2025లో భాగంగా ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్‌లో క్రీడాకారులు చేస్తున్న సాధనను, అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, సెట్రాజ్ సీఈవో కేఎస్‌వీ కాశీవిశ్వేశ్వరరావు, సమాచార పౌరసంబంధాలశాఖ డీడీ డి.నాగార్జున, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇన్వర్మేషన్ ఇంజనీర్ సీహెచ్ బాబురావు పాల్గొన్నారు.

కాకినాడలో అర్ధరాత్రి మొదలైన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

- భారీగా తరలివచ్చిన యువత 7





కాకినాడ జిల్లా క్రీడామైదానంలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న పోలీసు, ఆర్మీ అధికారులు.. (ఇన్‌సెట్)లో హాజరైన యువత

రియల్ బాన్స్!

ఎల్ఆర్ఎస్ మొదలైంది



- అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణ
- కూటమి సర్కారు అవకాశం
- జూలై 26న నోటిఫికేషన్
- 90 రోజులపాటు అమలు
- గతంలో 10,366 అప్లికేషన్లు
- 6,080 దరఖాస్తులకు ఓకే
- రియల్టర్ల ఆనందం

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గతంలోను అవకాశమిచ్చినా ఎల్ఆర్ఎస్ స్కీం అర్ధంతరంగా నిలిచిపోయింది. అప్పట్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,366 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు తాజాగా దానికి కొన్ని సవరణలు చేస్తూ గత నెల 26న దీనికి సంబంధించి జీవో విడుదల చేసింది. అందులో ఈ ఏడాది జూన్ 30వ తేదీలోపు రిజిస్టరయిన అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. దీనికి అక్టోబరు 24వ తేదీ వరకు గడువు ఇచ్చింది. అలాగే దరఖాస్తుదారులకు ప్రభుత్వం పలు రాయితీలను సైతం ప్రకటించింది.

గతంలో 10,366 మంది దరఖాస్తు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అక్రమ, అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు గతంలో 10,366 మంది దరఖాస్తు చేసుకున్నారు. రూ.47.98 కోట్ల పాక్షిక అపరాధ రుసుం చెల్లించారు. వీటిలో 6,080 దరఖాస్తులు అప్రూవల్ అయ్యాయి. 990 దరఖాస్తులు తిరస్కరించారు. 1327 దరఖాస్తులకు షార్ట్ ఫాల్ నోటీసులు ఇచ్చారు. 379 దరఖాస్తుదారులు డబ్బులు చెల్లించాల్సి ఉంది. 1580 దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. అనంతరం ఎల్ఆర్ఎస్ స్కీం అర్ధంతరంగా నిలిచిపోయింది. దీనికి కొన్ని సవరణలు చేసి 2025 జూన్ 30లోపు రిజిస్టర్ అయిన అనధికార లేఅవుట్లు, ప్లాట్లు అర్హత కలిగినవిగా సవరిస్తూ జీవోఎంఎస్ నెం.134ను 2025 జూలై 26న జారీ చేసిన నాటి నుంచి 90 రోజులు అంటే అక్టోబరు 24వ తేదీలోపు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోకపోతే నేరంగా పరిగణిస్తారు. అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. అనధికార లేఅవుట్లు, ప్లాట్లకు విద్యుత్, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వంటి వసతులు కల్పించరు. భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయరు. అనధికార లేఅవుట్లు, ప్లాట్లు రిజిస్ట్రేషన్‌శాఖ నిషేధిత ఆస్తుల జాబితాలో నమోదు చేస్తారు. దీంతో అమ్మకం, కొనుగోలు లావాదేవీలు జరపడం సాధ్యంకాదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

అక్టోబరు 24 వరకు అవకాశం



అనధికార లేఅవుట్లు,ప్లాట్ల యజమానులకు గుడ్‌న్యూస్.. అక్టోబరు 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరించుకోవాలి.

- రాహూల్ మీనా, జేసీ, వైస్‌చైర్మన్, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ

దరఖాస్తు ఇలా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కౌడా), రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా), పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పాడా),అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) పరిధిలో అర్హత కలిగిన అనధికార లేఅవుట్ల యజమానులు, అనధికార లే అవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేసిన యజమానులు తమ అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్ పోర్టల్ https:// dtcp.ap. gov.in వెబ్‌సైట్‌లో నేరుగా సిటిజన్ లాగిన్ లేదా ఆయా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల్లో లైసెన్సు పొందిన ఎల్టీపీల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

రాయితీలు..

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నవారు ఓపెన్ స్పేస్ చార్జీలపై 50శాతం రాయితీ పొందుతారు.సెప్టెంబరు 19వ తేదీలోపు ఫీజు చెల్లిస్తే పెనాల్టీ చార్జీలపై 5 శాతం తగ్గింపును పొందుతారు. 4 వేల చదరపు మీటర్లలోపు విస్తీర్ణం గల వ్యక్తిగత స్థలాలు ప్రభుత్వ రహదారి, ఇప్పటికే ఉన్న రహదారి సదుపాయం కలిగి అనధికార లేఅవుట్లలో భాగంకాకపోతే వాటిని క్రమబద్ధీకరించుకునే అవకాశం కలుగుతుంది. రాయితీలు పొందొచ్చు.

అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలి: కలెక్టర్


కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో వివేకానంద హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే అంశంపై పలుసార్లు దరఖాస్తులు వస్తే ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. వివిధ సమస్యలపై 580 అర్జీలు వచ్చాయన్నారు. అనంతరం వీటికి సంబంధించి ఆర్ఎస్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి అర్జీదారులకు రశీదులుఇచ్చారు. జేసీ రాహుల్ మీనా, డీఆర్వో వెంకట్రావు, ట్రైనీ కలెక్టర్ మనీషా, సీపీవో త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, ఎస్ఎస్ఏ పీవో వేణుగోపాల్, ఎస్టీసీజీజీహెచ్ శ్రీధర్ పాల్గొన్నారు.

పోలీస్‌గ్రీవెన్స్‌కు 93 అర్జీలు

కాకినాడ క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ పరిష్కారం కాక జిల్లావ్యాప్తంగా 93మంది అర్జీదారులు సోమవారం ఎస్పీ బిందుమాధవ్ నిర్వహించిన పోలీస్‌గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. ఈసందర్భంగా ఎస్పీ అర్జీదారుల సమక్షంలోనే సంబంధితపోలీస్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదులు సమ్మతమైనవైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనివారు సంబంధిత పోలీస్ స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాల్లోను సబ్‌డివిజన్ కార్యాలయాల్లోను ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ తెలిపారు.

తల్లి, ఇద్దరు కుమార్తెల హత్య కేసులో పోలీసులకు చిక్కిన నిందితుడు 7

రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా శుభం నొఖ్వాల్ 7



విద్యార్థులకు పాస్‌పోర్టు ఇస్తున్నారు. అయితే ఇది మన గుర్తింపును తెలియజేసే పాస్‌పోర్టు లాంటిది కాదు. అమ్మ పేరుతో మొక్కలు నాటినందుకు ఇచ్చే గ్రీన్‌పాస్‌పోర్టు. ఇందులో విద్యార్థులకు సంబంధించిన, నాటిన మొక్కల వివరాలు నమోదు చేయడంతో పాటు ఎదుగుదల ఆధారంగా పాయింట్లు ఇస్తారు. విద్యార్థి ఫొటోతో ఉండే ఈ గ్రీన్ పాస్‌పోర్టు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



విద్యార్థులకు పాస్‌పోర్టు



(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం)కు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భారీగా హాజరుకావడం ద్వారా గిన్నిస్ రికార్డు సాధించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు విద్యార్థులతో మొక్కలు నాటించి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మెగా పీటీఎం నిర్వహించిన రోజునే ఈ కార్యక్రమాన్ని లాంఛనప్రాయంగా ప్రారంభించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కల పెంపకంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు వారికి గ్రీన్ పాస్‌పోర్టులు అందించాలని నిర్ణయించారు. అమ్మ పేరుతో ఇప్పటికే మొక్కలు నాటిన విద్యార్థులకు వీటిని అందజేస్తున్నారు. విద్యార్థి ఫొటో, వారు పెంచే మొక్కల వివరాలతో ఉన్న ఈ పాస్‌పోర్టు వారిలో ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ పాస్‌పోర్టులు అందించిన తర్వాత మొక్కలు నాటేందుకు ముందుకు వచ్చిన విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంది.

అమ్మ పేరుతో....

మెగా పీటీఎంలో అమ్మకు వందనం పేరుతో విద్యార్థులతో వారి తల్లులకు పాదాభివందనం చేయించిన ప్రభుత్వం ఇప్పుడు అమ్మ పేరుతో మొక్క (ఏక్ పేడ్ మా కే నామ్) పేరుతో వారిని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు చేసే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విద్యార్థులకు ఎన్ని మొక్కలు అవసరమో ముందుగానే వివరాలు సేకరించి వారికి వాటిని అందించారు. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఇప్పటికే 3.50 లక్షలకు పైగా మొక్కలను విద్యార్థులకు అందించి నాటించారు. పాఠశాలల ఆవరణలు, ఖాళీ ప్రదేశాల్లో వీటి పెంపకం చేపట్టారు.

గ్రీన్ పాస్‌పోర్టు అంటే...

విద్యార్థి నాటిన మొక్క, ఆ విద్యార్థి వివరాలతో కూడినదే గ్రీన్ పాసుపోర్టు. దీనిని ఆకట్టుకునే విధంగా ఆకుపచ్చ రంగులో తీర్చిదిద్దారు. కవర్‌పై గ్రీన్ పాసుపోర్టు, అమ్మ పేరుతో మొక్క అని ఉంటుంది. మొదటి పేజీలో విద్యార్థి ఫొటో, పేరు, అపార్ ఐడీ, వయసు, పెన్ ఐడీ, పాఠశాల పేరు, చిరునామా ఉంటుంది. రెండో పేజీలో మొక్క పేరు, దాని శాస్త్రీయ నామం, ఏ రోజున మొక్క నాటారు, ఎక్కడ నాటారు, ఆ ప్రదేశం వివరాలను నమోదు చేయాలి. ఇక్కడి నుంచి మొక్క పెరుగుదలలో విద్యార్థి భాగస్వామ్యం మొదలవుతుంది. ఎప్పటికప్పుడు మొక్క పెరుగుదలను సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పరిశీలించుకోవాల్సి ఉంటుంది.

మొక్క ఎదుగుదల ఆధారంగా గ్రీన్ పాయింట్లు

మొక్క ఎదుగుదలను బట్టి విద్యార్థులకు గ్రీన్ పాయింట్లు లభిస్తాయి. గ్రీన్ పాసుపోర్టులో మై జర్నీ విత్ మై ప్లాంట్స్ గ్రోత్ కింద ప్రతినెలా మొక్క ఎదుగుదల స్థితి, గ్రీన్ పాయింట్లు నమోదు చేసి క్లాస్ టీచర్ సంతకం తీసుకోవాలి. గరిష్ఠంగా మూడు మొక్కల వివరాల నమోదు కు అవకాశం కల్పించారు. చివరి పేజీలో విద్యా సంవత్సరంలో విద్యార్థి సాధించిన గ్రీన్ పాయింట్లు, అచీవ్ అయిన గ్రీన్‌లెవెల్‌ను నమోదు చేయాలి.

మొక్కల కోసం ఏమి చేయాలి

అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి గల విద్యార్థుల వివరాలను ప్రతి పాఠశాలలో తీసుకుంటారు. వీరు కనిష్ఠంగా ఒకటి నుంచి మూడు రకాల వరకు ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. ఇలా ఎంపిక చేసుకోగానే పేరు, అపార్ ఐడీ వివరాలను ఉపాధ్యాయులు రిజిస్టర్ చేస్తారు. ఇప్పటికే పలు పాఠశాలల్లో ఈ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. అటవీ శాఖ సూచించిన నర్సరీ పాయింట్ల వద్దకు వెళ్లి విద్యార్థులు కోరుకున్న మొక్కలను పాఠశాలకు తీసుకువచ్చి వారికి ఎంఈవోలు, ఉపాధ్యాయులు అప్పగించాలి. ఇందుకు విద్యా శాఖ, సమగ్ర శిక్షా ద్వారా ప్రతి మొక్కకు రవాణా, ఇతర చార్జీలుగా రూ.7.85 మంజూరు చేశారు. ఈ విధంగా వచ్చిన తర్వాత విద్యార్థులు మొక్కలు నాటి సెల్ఫీ తీసుకోవాలి. ఈ ప్రక్రియను లీప్ యాప్ ద్వారా పూర్తి చేయాలి.



- పాఠశాలల్లో అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం
- మొక్కలు నాటిన వారికి గ్రీన్ పాస్‌పోర్టు
- విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షకులుగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం
- ఇప్పటికే 3.50 లక్షల మొక్కలు అందజేత



మొక్క ఎదుగుదల, సాధించిన పాయింట్లు వివరాల నమోదు పత్రిక

విద్యార్థులు ఆసక్తిగా ముందుకొస్తున్నారు

పి.వేణుగోపాలరావు సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ (ఏపీసీ)



అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు విద్యార్థులు ఆసక్తిగా ముందుకు వస్తున్నారు. వీరికి ఇచ్చే గ్రీన్ పాస్‌పోర్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మ కోసం మొక్క నాటడాన్ని విద్యార్థులు బాధ్యతగా ఫీలవుతున్నారు. కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లో గల 1,672 పాఠశాలల్లో విద్యార్థుల కోసం 1,90,788 మొక్కలను కేటాయించగా ఇప్పటిదాకా 1,20,917 మొక్కలను నాటారు. వీరి కోసం పాఠశాలలకు సమగ్ర శిక్షా ద్వారా 2.20 లక్షల గ్రీన్ పాసుపోర్టులను అందించాం. ఈ కార్యక్రమం నిరంతరాయం జరుగుతోంది. మొక్కల సంరక్షణలో విద్యార్థులను భాగస్వాములు చేయడం ద్వారా వారికి పర్యావరణ పర్యవరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం, అమ్మ ప్రాముఖ్యతను వివరించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.


అంతర్వేదిలో సముద్రానికి 10 మీటర్ల దూరంలో సాగు చేస్తున్న నువ్వుల చేను

సముద్ర తీరం చెంత నువ్వుల సాగు

కొబ్బరి తోటలో అంతర పంటగా సాగు చేస్తున్న రైతు దేవదాసు



అంతర్వేది, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర తీరంలో అంతర్వేదికి చెందిన రైతు కొల్లాబత్తుల దేవదాసు నువ్వుల పంట సాగు చేస్తున్నాడు. కొబ్బరి తోటలో అంతర పంటగా ఎకరం భూమిలో అర ఎకరం నువ్వు చేను సాగుకు కేటాయించాడు. వేసవికాలాన్ని సైతం లెక్క చేయకుండా సముద్ర ఇసుకలో సాగు ప్రారంభించి రెండు నెలలు అయ్యింది. మూడు నెలలకు పంట చేతికి వస్తుందని రైతు చెప్తున్నాడు. 50 కిలోల నువ్వుల వరకు పంట దిగుబడి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు. కొబ్బరి మొక్కలు వేసి ఐదు సంవత్సరాలు అయ్యిందని, ప్రస్తుతం కాపు వచ్చిన ఈ తోటలో నువ్వు సాగు చేయాలనే ఆలోచన మొదలైందని చెప్పాడు. గతంలో వేరుశనగ వేయగా అధికదిగుబడి వచ్చిందన్నారు. ప్రస్తుతం సరుగుడు తోటలకు డిమాండ్ లేదన్నారు. అర ఎకరంలో వేసిన నువ్వుల పంట చేతికి వచ్చిన తర్వాత మరింత ఎక్కువ సాగు చేస్తానని వివరిస్తున్నాడు. నువ్వులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని, ప్రస్తుతం అంతర్వేది ప్రాంతంలో నువ్వుల సాగులో దిగుబడి బాగుంటే మరింతమంది రైతులు ముందుకొచ్చే అవకాశం ఉందరు. వేసవిలో వేసిన ఈ నువ్వుల పంటకు మంచినీటి ట్యాంకర్ల ద్వారా నీరందించామన్నారు. చుట్టుపక్కల సముద్ర తీర ప్రాంతంలో ఉప్పు నీరు, ఉప్పు గాలి అధికంగా ఉంటుందన్నారు. ఈ ప్రాంత నేలలను సారవంతమైనవిగా మారిస్తే అన్ని పంటలూ పండించుకునేందుకు అనువుగా ఉంటాయన్నారు. జామ, మామిడి, జీడిమామిడి, కూరగాయల పంటలు పండించేందుకు అనుకూలంగా ఉంటాయన్నారు. ఫెన్సింగ్ వేసి పశువులు, పక్షులు రాకుండా పంటను జాగ్రత్తగా చూసుకుంటున్నారు. సముద్రపు నీరు రాకుండా జాగ్రత్తలు పాటిస్తే అంతర్వేది ప్రాంత భూములు మరింత సారవంతంగా మారి పంటలు పండించడానికి అనుకూలంగా ఉంటాయని రైతు దేవదాసు చెప్పాడు.

ఆప్కాబ్ ఆవిర్భావ వేడుకల్లో డీసీసీబీ చైర్మన్ తుమ్మల


ఆప్కాబ్ ఆవిర్భావ వేడుకల్లో తుమ్మల బాబు

పెద్దాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోపరేటీవ్ బ్యాంక్ లిమిటెడ్ (ఆప్కాబ్) 62వ ఆవిర్భావ వేడుకలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) సోమవారం హాజరయ్యారు. విజయవాడలో జరిగిన ఈకార్యక్రమానికి సహకార శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా డీసీసీబీ చైర్మన్లు, అధికారులు హాజరయ్యారని బాబు తెలిపారు. సహకార వ్యవస్థ ద్వారా రైతులకు మరిన్ని మెరుగైన సేవలందించడం, సహకార రంగంపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవడంతో పాటు స్థిరమైన సమగ్రతతో కూడిన వ్యవస్థను రూపొందించడం, రుణాల మంజూరు, తదితర విషయాలపై ఈ సమావేశంలో చర్చించినట్టు బాబు పేర్కొన్నారు.

మందేశ్వరస్వామిని దర్శించుకున్న గాయకుడు మనో


శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న మనో

కొత్తపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాయకుడు మనో కుటుంబ సమేతంగా సోమవారం మందపల్లి మందేశ్వర(శనేశ్వర)స్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయార్చకులు ఆయనకు స్వాగతం పలికారు.ఆపై మనో కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తన కుటుంబంతో పాటు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామిని కోరుకున్నట్టు మనో తెలిపారు. అనంతరం ఆలయ ఈవో డి.సురేష్‌బాబు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ చింతం విజయకృష్ణమోహన్ పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు అర్జున్-ప్రణీత్ ఎంపిక



కడియం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్ అండర్-14 జాతీయస్థాయి పోటీలకు కడియం గ్రామానికి చెందిన దాసరి నాగవెంకట అర్జున్, రాజమహేంద్రవరానికి చెందిన ఎం.ప్రణీత్ ఎంపికైనట్టు కోచ్ నాగులకొండ వీరభద్రరావు తెలిపారు. ఇటీవల సికింద్రాబాద్ స్కూల్ గేమ్స్ ఆంధ్రా, తెలంగాణ రీజనల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో అర్జున్-ప్రణీత్ జోడీ మొదటి స్థానంలో నిలిచింది. దీంతో వీరి జోడి సెప్టెంబర్ 24, 25 తేదీల్లో తమిళనాడులో జరిగే పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు


పవిత్రోత్సవ పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

ఆత్రేయపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సకల దోశ పరిహారార్థం తిరుమల తరహాలో ఏటా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే పవిత్రోత్సవాలు వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు వసంత మండపంలో నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో ఉత్సవమూర్తులను అలంకరించి విశ్వక్సేన పూజ, పుణ్యహవచనం, దీక్షాధారణ, అకల్మస హోమం నిర్వహించారు. ఉపకమిషనరు ఈవో నల్లం సూర్య చక్రధరరావు పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం అంకుర్పారణ,నవమూర్తి ఆవాహన, పంచసయ్యాదివాసం తదితర కార్యక్రమాలను వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.2,96,515 లభించింది.

నన్నయలో ఎంటర్‌ప్రెన్యూర్ అభివృద్ధి కేంద్రం!

ఉపకులపతి ప్రసన్నశ్రీ


నందగోపాల్‌ను సన్మానిస్తున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ వర్శిటీకి హైదరాబాద్ నుంచి ఇండస్ట్రియల్ కన్సల్టెంట్ నందగోపాల్ సోమవారం వచ్చారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై వారు చర్చించారు. ఈ వివరాలను వీసీ తెలుపుతూ ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ నుంచి ఉపయోగకరమైన ప్రాజెక్టులు తీసుకొచ్చి వ్యవస్థాపకత, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలు విద్యాసంబంధాలను పెంపొందించడంపై దృష్టిసారించాలన్నారు. డిజైన్ అభివృద్ధి మేధోసంపత్తి హక్కులకు మద్దతు ఇవ్వడం ద్వారా ఆవిష్కరణ, వ్యవస్థాపకతను పెంపొందించడం లక్ష్యంగా నన్నయ వర్శిటీని హోస్ట్ ఇనిస్టిట్యూట్‌గా ముందుకు తీసుకెళ్తామన్నారు. నందగోపాల్ మాట్లాడుతూ మంత్రిత్వ శాఖల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ప్రాజెక్టులు తీసుకొస్తానని, తద్వారా విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగ కల్పన విభాగాధికారి ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, కామర్స్, మేనేజ్మెంట్ విభాగాధిపతి ఆచార్య ఉమామహేశ్వరీదేవి పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతపై దృష్టిపెట్టాలి

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ
- జేఎన్టీయూకేలో దీక్షారంభ్ కార్యక్రమం ప్రారంభం



జేఎన్టీయూకే, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆధునిక సాంకేతికతపై దృష్టిపెట్టాలని సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. జేఎన్టీయూకేలోని ఎస్ఈకేలో మొదటి సంవత్సరం విద్యార్థులకు దీక్షారంబ్ కార్యక్రమాన్ని ఈనెల 16 వరకూ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం సోమవారం ప్రారంభం కాగా మొదటి రోజు ఇండక్షన్ కార్యక్రమానికి లక్ష్మీనారాయణ విచ్చేసి మాట్లాడారు. భవిష్యత్‌లో ఏఐ టెక్నాలజీకి తగినట్లుగా ఉద్యోగవకాశాల కోసం, సివిల్ సర్వీసెస్ సాధించడానికి ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకుని కృషిచేయాలని సూచించారు. అంతే కాకుండా యువత స్మార్ట్ ఫోన్, చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా గ్రంథాలయం, క్రీడా వసతులను వినియోగించుకుని భవిష్యత్‌లో యూనివర్శిటీకి, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్స్ దీక్షితులు, స్వరూపారాణి, సమన్వయకర్తలు జయప్రసాద్, డాక్టర్ శ్యామ్‌కుమార్, డాక్టర్ ఎస్.సత్యవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వర్ణ మాణిక్యాంబ

అమ్మవారికి స్వర్ణపూత కవచం అందజేసిన మాజీ మంత్రి వేణు కుటుంబం


స్వర్ణకవచాలంకృత మాణిక్యాంబ అమ్మవారు

ద్రాక్షారామ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయం లో ద్వాదశ శక్తిపీఠంగా పూజలు అందుకుంటున్న మాణిక్యాంబ అమ్మవారికి సోమవారం మాజీ మం త్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ దంపతులు స్వర్ణపూత కవచం(చీర) సమర్పించారు. ఉదయం కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకున్న వేణు దంపతులు, కుమారుడు నరేన్ దంపతులు భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం వేణు దంపతులు అమ్మవారికి స్వర్ణపూతకవచం సమర్పించగా అర్చకులు సంప్రోక్షణ పూజలు చేసి అమ్మవారికి అలంకరించారు. దర్శన అనంతరం వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో అల్లు వెంకట దుర్గాభవానీ, జడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవానీ, వైస్ ఎంపీపీలు శాకా బాబీ, నరాల రాజ్యలక్ష్మి, సర్పంచ్‌లు యల్లమల్లి సతీష్‌కుమార్, అంబటి తుకారాం, పెమ్మిరెడ్డి దొరబాబు, కట్టా గోవిందు, ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, వాసంశెట్టి శ్యామ్, కోటిపల్లి అబ్బు, భజన భక్త సమాజం సభ్యుడు బోనం శ్రీను పాల్గొన్నారు.

బతుకు బండి.. ఇలాగైతే ఎలాగండీ!?

రాజమహేంద్రవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఈ ఫొటోలో తన తోపుడు బండిని అతి కష్టంపై ఆటోకు కట్టుకొని తీసుకెళుతున్న ఆ మహిళ చిరు వ్యాపారి. ఏవీఏ రోడ్డులోని వెంకటేశ్వర స్వామి గుడి సమీపంలో తోపుడు బండిపై కూరగాయలు అమ్ముకొని జీవనం సాగిస్తోంది. ఆమెకు దివ్యాంగుడైన ఒక కుమారుడు ఉన్నాడు. ఆమెకిదే బతుకుబండి.. ఇదిలా ఉండగా రోడ్డు పక్కన ఉన్న తోపుడు బండిని నగరపాలక సంస్థ సిబ్బంది లాక్కెళ్లిపోయారు. సోమవారం ఉదయం వచ్చిన ఆమె, బండి లేకపోవడంతో లబోదిబోమంది. స్థానికులు చెప్పడంతో నగరపాలక సంస్థ కార్యాలయానికి పరుగు పెట్టింది. రూ.500 జరిమానా చెల్లిస్తేనే బండిని ఇస్తామని మునిసిపల్ సిబ్బంది సెలవిచ్చారు. అయితే ఆమె వద్ద రూ.500 లేకపోవడంతో అప్పు చేసి ఆ సొమ్ములు చెల్లించింది. ఆ బండిని ఆటోకు కట్టి లాక్కెళుతుండగా బతుకు బండి ముక్కలైపోయింది. ఇది చూసిన స్థానికులు పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా చిరు వ్యాపారులపై ఈ జరిమానాలేంటని రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ సిబ్బంది తీరుపై మండిపడ్డారు.



ఆంధ్ర పాలిటెక్నిక్‌లో నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

ప్రిన్సిపాల్ జనార్దనరావు

కాకినాడ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆంధ్ర పాలిటెక్నిక్ కళాశాలలో ప్రథమ సంవత్సరం డిప్లొమా కోర్సుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ఈ నెల 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.జనార్దనరావు తెలిపారు. మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఆర్కిటెక్చర్, ఆటోమొబైల్, సివిల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి మంగళవారం ఉదయం 11 గంటల నుంచి అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

కాండ్రకోట నూకాలమ్మకు వెండి ఆభరణాల బహూకరణ



పెద్దాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కాండ్ర కోట నూకాలమ్మకు విశాఖపట్నానికి చెందిన బండారు శ్రీనివాస సత్యేంద్ర-పద్మజ దంపతులు వెండి కవచం, ఆయుధ సహిత హస్తాలు, సూర్య చంద్రులను బహూకరించినట్టు ఈవో ఎం.రాంబాబురెడ్డి సోమవారం తెలిపారు. దాతలకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేదాశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు.

ప్రయత్నం ఫలించే.. ప్రాణం నిలిచే!

ఆంబోతును సెప్టిక్‌ట్యాంకు నుంచి బయటకు తీసిన ఫైర్ సిబ్బంది


సెప్టిక్ ట్యాంకులో పడిపోయిన ఆంబోతు

అంబాజీపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సెప్టిక్‌ట్యాంకులో పడిపోయిన ఆంబోతు కోసం ఫైర్‌సిబ్బంది అవిశ్రాంతంగా శ్రమించి బయటకు తీశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారం పరిధిలోని అల్లాడస్వామినాయుడుకాలనీలో తొత్తరమూడి వెంకటరమణ ఇంటి ఆవరణలో 15అడుగుల లోతులో వరలతో సెప్టిక్‌ట్యాంకు నిర్మాణం చేపడుతున్నారు. సోమవారం సెప్టిక్‌ట్యాంకులో ఆబోంతు పడిపోయింది. దీంతో స్థానికులు అమలాపురం ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో 15 అడుగుల లోతులో పడిపోయిన ఆంబోతును 2 గంటలు శ్రమించి బయటకు తీశారు. అనంతరం ఆంబోతుకు ప్రాథమిక చికిత్స అందించారు.


బయటకు వచ్చిన ఆంబోతు


బయటకు తీసేందుకు శ్రమిస్తున్న ఫైర్ సిబ్బంది

పదరా.. పదరా.. పదరా..

- ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి భారీగా తరలివచ్చిన యువత
- కాకినాడలో సోమవారం అర్ధరాత్రి ప్రారంభమైన ర్యాలీ
- కాకినాడ జిల్లా క్రీడామైదానంలో శారీరక దారుఢ్య పరీక్షలు

యువతరం తరలివచ్చింది. ఆర్మీ కొలువు కోసం కదిలివచ్చింది. భుజాన బరువైన బ్యాగులతో కాకినాడలో అడుగు పెట్టింది. దీంతో కాకినాడ జిల్లా క్రీడామైదానం మరోసారి కిటకిటలాడింది.


ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి వచ్చిన అభ్యర్థులు

కాకినాడ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలోని జిల్లా క్రీడామైదానంలో సోమవారం అర్ధరాత్రి అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ప్రారంభమైంది. ఇప్పటికే తొలిదశలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన క్యాండెట్ అర్హత పరీక్షలో ప్రతిభ కనబరిచిన పదివేలమంది యువత రెండో దశ ఎంపిక కోసం కాకినాడ జిల్లాకు చేరుకున్నారు. ఈ ర్యాలీలో మొత్తం 12 జిల్లాలతోపాటు యానాం అభ్యర్థులు కూడా పాల్గొననున్నారు. తేదీల వారీగా ఆయా జిల్లాల వారికి ఈవెంట్లు జరగనున్నాయి. ఆగస్టు 5వ తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అభ్యర్థులకు శారీరక దారుఢ్యపరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో ఆయా జిల్లాల అభ్యర్థులు సోమవారం రాత్రి పదిగంటలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనకాపల్లి, యానాం, పార్వతీపురం, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ జిల్లాల అభ్యర్థులకు తర్వాత తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ముందుగా తరలివచ్చిన అభ్యర్థులకు జేఎన్‌టీయూకే క్రీడామైదానంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు.

రాత్రి ఒంటి గంటన్నర నుంచి..

తొలుత కాకినాడ జిల్లా క్రీడామైదానం ప్రధాన గేటు వద్ద నుంచి అడ్మిన్‌కార్డులను పరిశీలించి అభ్యర్థులను లోపలికి అనుమతించారు. తర్వాత కుడిపక్కన ఏర్పాటు చేసిన టెంట్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. దూరప్రాంతాలనుంచి వచ్చే విద్యార్థులు విశ్రాంతి తీసుకునేందుకు గుడారాలను ఏర్పాటు చేశారు. భోజనం, వసతి కల్పించారు. రాత్రి ఒంటి గంటన్నర దాటిన తర్వాత నుంచి 1.6 కేఎం పరుగు, ఇది 6.15 నిమిషాల్లో పూర్తి చేయాలి. ఇందులో ఎంపికైన వారు ఎత్తు, బరువు, ఛాతీ, లాంగ్ జంప్, జిగ్‌జాగ్, బ్యాలెన్స్, పుష్ అప్స్, వంటి ఫిజికల్ ఫిటెనస్ పరీక్షలు నిర్వహించారు. అర్హత సాధించిన విద్యార్థులకు మెడికల్ టెస్టులు, తర్వాత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటాయి.

ఆంబోతుకు అంత్యక్రియలు


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆంబోతుకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం- కొత్తపేట ప్రధాన రహదారిలో సోమవారం గొలకోటివారిపాలెం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో ఆంబోతు మృతిచెందింది. విషయం తెలుసుకున్న మోడేకుర్రు సర్పంచ్ కు డుపూడి రామలక్ష్మీవెంకటేశ్వరరావు అక్కడికి చేరుకుని గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో శాస్రోక్తంగా పూజలు నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించి ఖననం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామపెద్దలు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఏడుగురు విద్యార్థులకు గాయాలు

హంసవరం ఏపీ మోడల్ స్కూల్‌కి వెళ్తుండగా ఢీకొన్న కారు

తుని ఏరియా ఆసుపత్రికి తరలింపు


బోల్తా కొట్టిన ఆటో


తుని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

తునిరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం హంసవరం గ్రామ సమీపంలో సోమవారం ఉదయం విద్యార్థులతో వెళ్తన్న ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో బోల్తా కొట్టింది. దీంతో ఏడుగురికి గాయాలయ్యాయి. రోజు మాదిరిగానే తుని మండలం మరువాడ గ్రామం నుంచి విద్యార్థులు ఆటో ఎక్కి హంసవరంలో గల ఏపీ మోడల్ స్కూల్‌కి వెళ్తుండగా కారు ఢీకొనడంతో ఆటో అదుపుతప్పి పంటపొలాల్లోకి బోల్తా కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు విద్యార్థులకు గాయాలు కాగా ఆటో డ్రైవర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. విద్యార్థులు చెల్లాచెదురుగా పడిపోవడంతో తల, కాళ్లకు గాయాలయ్యాయి. కేకలు వేయడంతో ఆ ప్రాంతంలోని రైతులు, పాఠశాల ఉపాధ్యాయులు హుటాహుటిన చేరుకుని విద్యార్థులను తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయాలపాలైన విద్యార్థులు అప్పన రావణ్‌కుమార్, కామిరెడ్డి కృపానంద, కామిరెడ్డి సాత్విక్, కిల్లాడి నవీన్ రాజు, రామ్‌చరణ్, ఉరుకోటి రవి, ఉరుకోటి పవన్, జి.ఈశ్వరికి వైద్యులు పరీక్షలు చేసి చికిత్స అందించారు. ఆటోను ఢీకొన్న కారు ఆగకుండా వెళ్లిపోవడంతో సీసీ ఫుటేజ్ ఆధారంగా కారును పట్టుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ప్రమాదం సమాచారం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనతో ఏరియా ఆసుపత్రికి పరుగులు తీశారు. గాయాలతో ఉన్న తమ పిల్లలను చూసి కన్నీరు పెట్టుకున్నారు. ఘటనపై తుని ఎమ్మెల్యే దివ్య ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



తునిరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటనపై తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకా రం.. కాకినాడ జిల్లా తుని తాండవ బ్రిడ్జిపై నా గరాజుపేట రైల్వే గేటు వైపు నుంచి తుని రైల్వేస్టేషన్ వైపు బ్రిడ్జిపై వ్యక్తి నడుచుకుని వస్తుండగా రైలు ఢీకొనడంతో మరణించాడు. మృతదేహంపై నలుపురంగు జీను ప్యాంట్, చింతపిక్క రంగు కట్‌డ్రాయరు ఉన్నాయన్నారు. ఎడమకన్నుకు అంధత్వం ఉందన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో ఉంచామని, వివరాలు తెలిస్తే సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కాకినాడ క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ ప్రాంగణంలో సోమవారం ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. సుమారు 40 నుంచి 45 ఏళ్ల ఉండే మహిళ మృతదేహాన్ని గమనించిన స్థానికులు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సీఐ కెవివి సత్యనారాయణ సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం బంధువులు గుర్తించేందుకు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతురాలి ఆచూకీ తెలిస్తే 08842379052, 9440796542లో సంప్రదించాలని సీఐ సత్యనారాయణ కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతి చెందిన దానయ్య

పెరవలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతిచెందాడు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారంలో పల్లా దానయ్య (42) గ్రామంలో ఇళ్ల వద్ద విద్యుత్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గ్రామంలో కేబుల్ వైర్లు కట్టేందుకు పిలవడంతో వెళ్లాడు. విద్యుత్ స్తంభంపైకి కేబుల్ వైర్లు కట్టడానికి ఎక్కగా షాక్‌కు గురై కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య ధనలక్ష్మితో పాటు చదువుకునే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆ కుటుంబం బాధ వర్ణనాతీతంగా మారింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నీ ఏకపక్షమే..

కాకినాడలో నాల్గో రోజు జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు


మ్యాచ్ ఆడుతున్న ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్ జట్ల సభ్యులు

క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్న ఓ కోచ్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరుగుతోన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళ జాతీయ చాంపియన్‌షిప్‌లో భాగంగా సోమవారం నాల్గోరోజు మ్యాచ్‌లన్నీ ఏకపక్షంగానే జరిగాయి. ముఖ్య అతిథులుగా హాజరైన రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, కాకినాడ అపోలో ఆసుపత్రి ప్రతినిధులు మ్యాచ్‌లను ప్రారంభించారు. కాకినాడ క్రీడా మైదానంలోని ఆస్ట్రో టర్ఫ్ హాకీ ఫీల్డ్‌లో 6 మ్యాచ్‌లు జరిగాయి. దాద్రానగర్ హవేలి- జమ్మూ కాశ్మీర్ జట్ల మధ్య మ్యాచ్‌లో దాద్రానగర్ హవేలీ 6-0తో విజయం సాధించింది. గుజరాత్, రాజస్థాన్ జట్ల మధ్య మ్యాచ్‌లో గుజరాత్ 3-2తో విజయం సాధించింది. మిజోరాం, తెలంగాణ మధ్య మ్యాచ్‌లో మిజోరం 15-0 తో విజయం సాధించింది. మణిపూర్, పుదుచ్చేరి మధ్య మ్యాచ్‌లో మణిపూర్ 9-1తో.. అస్సాం, కేరళ మ్యాచ్‌లో అస్సాం 5-1తో.. ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్ మధ్య మ్యాచ్‌లో ఢిల్లీ 7-1 తేడాతో విజయం సాధించాయి. మ్యాచ్‌లను కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసకుమార్, హాకీ ఆంధ్ర సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు పర్యవేక్షించారు.

తల్లి, ఇద్దరు కుమార్తెల హత్య కేసు..

పోలీసుల అదుపులో నిందితుడు!

సామర్లకోట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట సీతారామ దళిత కాలనీలోని ఓ ఇంటిలో తల్లి,ఇద్దరు కుమార్తెలను దారుణంగా హతమార్చిన వ్యక్తిని సామర్లకోట పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. శనివారం అర్ధరాత్రి ఈ హత్యోదంతం అనంతరం సామర్లకోట నుంచి సదరు అనుమానితుడు పొరుగు జిల్లాకు వెళ్లిపోగా సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు వెళ్లి మాటు వేసి పట్టుకున్నట్టు సమాచారం. ఈ హత్యలకు సామర్లకోటకు చెందిన తలే సురేష్ పాల్పడినట్టు పోలీసుల వద్ద పక్కా సమాచారం లభించడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. అయితే ఈ హత్యలకు ప్రధాన కారణం వివాహేతర సంబంధమేనని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. స్థానిక కోట్లమ్మచెర్వు ప్రాంతానికి చెందిన సురేష్ లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడని, మృతురాలి ఇంటికి గత కొంత కాలంగా రాకపోకలు సాగిస్తున్నట్టు సమాచారం పోలీసులకు లభించినట్టు తెలిసింది.

పోస్టుమార్టంలో విస్తుపోయే అంశాలు

హత్యకు గురైన తల్లి,కుమార్తెల మృతదేహాలకు పోస్టుమార్టం చేసిన వైద్యులు విస్తుపోయినట్టు విశ్వసనీయ సమాచారం. మాధురి తలభాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యేలా కొట్టినట్టు, పెద్దకుమార్తె అయిన పుష్పకుమారిని తల పైభాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యిందని తెలుస్తోంది. చిన్న కుమార్తె జెస్సీని తలపై కొట్టడంతో బాటు గొంతు, గుండెలపై తొక్కడంతో రిబ్స్ ఎముకలు విరిగిపోయినట్టు పోస్టుమార్టం సమయంలో వైద్యులు గుర్తించినట్టు సమాచారం.

పుట్టినరోజు వేడుకలకు వెళ్తూ...

లారీ ఢీకొని యువకుడి మృతి


సాయినవీన్ (ఫైల్)

దేవరపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పెదనాన్న మనవడి పుట్టిన రోజు వేడుకకు వెళ్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వెంకటనగర్‌కు చెందిన చెలమశెట్టి మహావీర సాయినవీన్ (25) తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేటలోని శ్రీ లక్ష్మీతులసి ఆగ్రో పేపర్ మిల్లులో డీసీఎస్ ఆపరేషన్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. రాజమహేంద్రవరంలో పెదనాన్న మనవడి పుట్టినరోజు వేడుకకు అశ్వారావుపేట నుంచి సోమవారం ఉదయం 11గంటలకు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. మార్గమధ్యలో గౌరీపట్నంలో జాతీయ రహదారి వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి తల్లిదండ్రులు ఆరేళ్లక్రితం మృతిచెందారు. తమ్ముడు శివశంకర్ రాజమహేంద్రవరంలో డెకరేషన్ వర్క్ చేస్తున్నాడు. సాయినవీన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతిపై కేసు


మృతిచెందిన వ్యక్తి

రాయవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి నట్టు రాయవరం ఎస్ఐ డి. సురేష్ బాబు సోమవారం రాత్రి విలేకర్లకు తెలిపారు. కోనసీమ జిల్లా రాయవరం మండలంలోని పసలపూడి చైతన్య రైస్‌మిల్లు సమీపంలో సుమారు 70 ఏళ్ల కలిగిన గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటం గమనించిన స్థానికులు 108 సహాయంతో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9440904843కు ఫోన్ చేయాలని ఎస్ఐ కోరారు.

రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా శుభం నొఖ్వాల్


కొత్త సబ్‌కలెక్టర్ శుభం నొఖ్వాల్

రంపచోడవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరం రెవెన్యూ సబ్ డివిజన్‌కు కొత్త సబ్‌కలెక్టర్‌గా 2023 బ్యాచ్‌కు చెందిన శుభం నొఖ్వాల్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా ఉన్న కల్పశ్రీ స్థానంలో ఈయన్ను నియమించారు. శుభం నొఖ్వాల్ రాజస్థాన్‌లోని గంగానగర్ ప్రాంతంలోని ఓ పల్లెటూరు నుంచి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఢిల్లీ విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉన్న హన్సరాజ్ కళాశాలలో ఫిలాసఫీలో బ్యాచిలర్ డిగ్రీ చేసి సివిల్స్‌కు ఎంపికయ్యారు. ఈయన తండ్రి ఇంద్రజిత్ నొఖ్వాల్ రైల్వేలో సీటీఐగా పనిచేస్తుండగా, తల్లి శకుంతలావర్మ ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. శుభం నొఖ్వాల్ సోదరి స్వాతి నొఖ్వాల్ కూడా 2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి కాగా, ఈయన బావ కులదీప్ కూడా ఐఏఎస్ అధికారిగా ఉన్నారు. 2023 బ్యాచ్‌కు చెందిన ఈయన ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు ఎంపికై అసిస్టెంట్ కలెక్టర్‌గా ఎన్టీఆర్ జిల్లాలో పనిచేశారు. అనంతరం ఈయనను రంప చోడవరానికి సబ్ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఇదిలాఉండగా రంపచోడవరం ప్రస్తుత సబ్ కలెక్టర్ కల్పశ్రీకి పదోన్నతిపై అల్లూరి జిల్లాలోనే ఏదో ఐటీడీఏకు ప్రాజెక్టు అధికారిగానో లేక రాజమండ్రి, కాకినాడ జిల్లాల్లో ఏదో ఒకచోట ముఖ్య పోస్టులలో నియ మిస్తారన్న ప్రచారం సాగుతోంది.

స్వదేశానికి రప్పించండి

కువైట్‌లో అవస్థలు పడుతున్న ర్యాలి మహిళ


ఆవేదన వ్యక్తం చేస్తున్న ర్యాలికి చెందిన గుమ్మడి లక్ష్మి

ఆత్రేయపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన గుమ్మడి లక్ష్మి ఉపాధి నిమిత్తం మూడున్నర ఏళ్ల క్రితం దుబాయ్‌కి వెళ్లింది. అక్కడ నుంచి తిరిగి స్వగ్రామానికి వస్తున్న సమయంలో అక్కడయ జమానులు దొంగతనం నేరం మోపి కేసు పెడతానంటూ బెదిరిస్తూ తనను రాకుండా అడ్డుకుంటున్నారని ఆ మహిళ కన్నీటి పర్యాంతం చెందుతూ ఓ వీడియో పోస్టు చేసి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. 'నేను కువైట్‌లో చాలా కష్టాల్లో ఉన్నాను. నన్ను ఎలాగైనా మా గ్రామానికి రప్పించండి' అంటూ స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు ఎన్ఆర్ఐలు సంబంధిత అధికారులను వేడుకుంటుంది. నున్ను స్వదేశానికి రప్పించాలని ఆమె ప్రాథేయపడుతుంది.

రాష్ట్రస్థాయి పోటీలకు పి.గన్నవరం విద్యార్థి


సందీప్‌ను అభినందిస్తున్న హెచ్ఎమ్ ఉమాదేవి

పి.గన్నవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025 పోటీలకు లాంగ్‌జంప్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం జడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి కలిగితి సందీప్ ఎంపికైనట్టు హెచ్ఎం కె.ఉమాదేవి తెలిపారు. ఈనెల3న రామచంద్రపురం ఎస్‌కేవీఎస్ కళాశాలలో జరిగిన పోటీల్లో అండర్-16 లాంగ్ జంప్‌లో సందీప్ మొదటిస్థానం, 60మీటర్ల పరుగుపందెంలో ద్వితీయస్థానం సాధించినట్టు చెప్పారు. సందీప్ ఈనెల 9,10,11న బాపట్ల జిల్లా చీరాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.దుర్గాప్రసాద్, కె.భీమేంద్ర అభినందించారు.

పేకాటలో పట్టుబడ్డ అన్నవరం దేవస్థానం ఉద్యోగి

విచారణాధికారిగా డీసీ

అన్నవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో పేకాట ఆడుతూ పట్టుబడ్డ అన్నవరం దేవస్థానం ఉద్యోగిపై విచారణకు దేవస్థానం డిప్యూటీ కమిషనర్ బాబూరావును విచారణాధికారిగా నియమిస్తూ ఈవో సుబ్బారావు ఆదేశాలిచ్చారు. ఆయన నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటారని దేవస్థానం వర్గాలు వెల్లడించాయి. ఇదిలాఉండగా సదరు ఉద్యోగి సోమవారం ఈవోను కలసి విజ్ఞాపన అందజేశారు.

వనదుర్గ ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు

తొలిరోజు బాలాత్రిపురసుందరి అలంకారం


బాలాత్రిపురసుందరిగా దర్శనమిస్తున్న వనదుర్గ అమ్మవారు


వనదుర్గమ్మకు సారె సమర్పిస్తున్న ఈవో వీర్ల సుబ్బారావు, కుటుంబసభ్యులు

అన్నవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి శ్రావణ మాసోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం, మంటపారాధన నిర్వహించగా ఈవో, చైర్మన్ పండితులకు దీక్షావస్త్రాలను అందజేశారు. తొలిసారిగా అమ్మవారికి దేవస్థానం తరుపున సారెను సమర్పించారు. ఆషాఢమాసంలో సమర్పించాలని ముందుగా అనుకున్నా వైదికకమిటీ సూచనలతో శ్రావణమాసంలో అమ్మవారి ఉత్సవాల సమయంలో అందించాలని పేర్కొనడంతో ఈవో కుటుంబసభ్యులు, దేవస్థానం ఆలయ విభాగ అధికారులు, పండితులతో మేళతాలాల నడుమ సారె, చీరలు, గాజులు, ఇతర తీపి పదార్థాలను అందజేశారు. తొలిరోజున అమ్మవారు బాలాత్రిపురసుందరిగా భక్తులను అనుగ్రహించారు. పౌర్ణమి వరకు ఈ జాతర ఉత్సవాలు జరగనుండగా రోజుకొక అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారు. ప్రత్యేక పూజల్లో ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

- నిందితుడు తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండల వాసి
- ద్విచక్రవాహనం, 44.5 గ్రాముల బంగారం, 8 గ్రాముల వెండి ఆభరణాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తిరుపతిరావు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం ఎస్సీ పేట గ్రామానికి చెందిన గొర్రెల చిన్నబాబు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రామచంద్రాపురం కాలనీలో 4.5 గ్రాముల బంగారం, 8 గ్రాముల వెండి, ఆర్‌టీసీ కాలనీలో 40 తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్టు తెలిపారు. మే 31న డోర్నకల్‌లో బైక్ చోరీ జరిగినట్టు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసును విచారిస్తున్న క్రమంలో సోమవారం ఉదయం జిల్లా కేంద్రంలోని నర్సంపేట బైపాస్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నట్టు తెలిపారు. విచారించగా అతడు చేసిన 6 దొంగతనాలను ఒప్పుకున్నట్టు తెలిపారు. నిందితుడి నుంచి బంగారం, వెండి ఆభరణాలతో పాటు ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆభరణాల విలువ రూ.1,00,000 ఉంటుందన్నారు. దొంగను పట్టుకున్న పోలీసు సిబ్బందిని అభినందిచారు.

7న అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం

పిఠాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రిగా తనకు అందుతున్న వేతనాలను పిఠాపురం నియోజకవర్గంలోని 42 మంది అనాథ పిల్లలకు రూ.5వేల వంతున చెక్కుల రూపంలో అందించేందుకు ఏర్పాట్లు చేయాలని పవన్‌కల్యాణ్ తన కార్యాలయ అధికారులను ఆదేశించారు. పది మంది క్రియాశీలక కార్యకర్తల ద్వారా ఈ నెల 7వ తేదిన ఈ మొత్తాలను అనాథ పిల్లల గృహాల వద్దకు వెళ్లి అందజేయాలని సూచించారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్ఈ వెంకట్రావు

'అర్జీలను సత్వరం పరిష్కరించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని నగరపాలక సంస్థ ఎస్ఈ పి.వెంకట్రావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన పీజీఆర్ఎస్‌లో పది అర్జీలను స్వీకరించారు. డయల్ యువర్ కమిషనరు కార్యక్రమంలో ఇన్‌చార్జి మేనేజరు రామశాస్త్రి ఫోనులో ఫిర్యాదులను స్వీకరించారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ, రెవెన్యూ సూపరింటెండెంట్ శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

పిఠాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్నమాంబ పార్కులో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ విగ్రహం ఏర్పాటుకు వైబ్రెంట్స్ ఆఫ్ కలామ్ ఆర్గనైజేషన్ ముందుకు వచ్చింది. సంబంధిత పనులకు జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సోమవారం భూమి పూజ చేశారు. కౌన్సిలర్ రాయుడు శ్రీను, జనసేన నాయకులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన తాళ్లరేవు మండలం సుంకరపాలెం సర్పంచ్, గ్రామస్తులు


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు


నిషేధిత జాబితా నుంచి తమ నివాసాలను తొలగించాలని కలెక్టర్‌కు విన్నవిస్తున్న కాకినాడ అర్బన్ పరిధిలోని ఇళ్ల యజమానులు

కలెక్టరేట్ ఎదుట ధర్నాల హోరు

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 4 (ఆంధ్ర జ్యోతి): తాళ్లరేవు మండలం సుంకరపాలెంలో సర్పంచ్ ఆక్రమించిన భూములపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ సొసైటీ మాజీ అధ్యక్షుడు మోపూరి వెంకటరెడ్డినాయుడు కలెక్టర్ షాన్‌మోహన్‌కు సోమవారం కలెక్టరేట్లో వినతిపత్రం ఇచ్చారు. గ్రామంలోని 123, 125 సర్వే నెంబర్లలో వున్న 120 సెంట్ల డ్రైను పోరంబోకు స్థలాన్ని కొంతకాలంగా ఆక్రమించుకున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ప్రజలు, రెవెన్యూ అధికారులు గ్రీన్ ట్రిబ్యునల్‌కు కూడా ఫిర్యాదు చేశారని వివరించారు. అధికారిక లెక్కల ప్రకారం ఆ కాలువ విస్తీర్ణం 6.50 ఎకరాలు కాగా దానిలో కొంత భాగాన్ని ఆక్రమించారన్నారు. పితాని పోతురాజు, పలివెల రవి, గుత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నవీన్‌రాజ్, లక్ష్మణ్ మాట్లాడుతూ జర్నలిస్టుల పట్ల ప్రభుత్వ వైఖరి మారాలన్నారు. తక్షణం ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. ప్రతిఏటా అక్రిడేషన్లు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. దేశంలో అనేక రాష్ట్రాల్లో సీనియర్ జర్నలిస్టులకు పింఛను ఇస్తున్నారని, ఏపీలో కూడా అదే మాదిరిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య బీమా పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు.

పాఠశాలల్లోకి మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మినహా ఎవరినీ అనుమతించవద్దని పాఠశాల విద్యా శాఖ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ పాఠశాల విద్యా శాఖ ఇచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల ప్రజాస్వామిక హక్కులను కాలరాయడమేనన్నారు. విద్యా శాఖ మంత్రిగా ఉన్న లోకేశ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యార్థి సంఘాలతో సంప్రదింపులు చేసేవారన్నారు. ఇప్పుడు ఆయన వైఖరి మారిందని విమర్శించారు. ఇలాంటి ఉత్తర్వులు ఇవ్వడం వలన కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో జరిగే అన్యాయాలను విద్యార్థి సంఘాలు అడ్డుకునే అవకాశం ఉండదన్నారు. ఈ నేపథ్యంలో విద్యా శాఖ ఇచ్చిన ఉత్తర్వులను తక్షణం రద్దు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, గంగా సూరిబాబు, నాయకులు సాహిత్, వాసు, చిన్ని, సిద్ధు, లోవరాజు, మణికంఠ, అమృత, ఉదయ్ కుమార్, సంతోష్, గోపాల్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో సర్వే నెం.431, 762, 776, 777ల్లో ఉన్న మాదిగ నౌకరీ ఈనాం భూములపై తమకు భూ యాజమాన్య హక్కులు కల్పించాలని గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ పిఠాపురం మహారాజా కాలంలో తమ పూర్వీకులకు మాదిగ నౌకరీ ఈనాం భూముల కింద వీటిని సాగు చేసుకోవడానికి ఇచ్చారన్నారు. అయితే ఈ భూములను కొందరు కబ్జాకు ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. తమకు వారసత్వంగా సంక్రమించిన ఈ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. పైగా నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ చేసి భూ యాజమన్య హక్కులు కల్పించాలని కోరారు. చర్యలు తీసుకోవాలని ప్రత్తిపాడు రెవెన్యూ అధికారులను కోరినా స్పందించలేదని చెప్పారు.

కాకినాడ సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఎంఎస్ఎంఈ పథకంలో వాహనాలు తీసుకున్న ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ విడుదల చేసి న్యాయం చేయాలని మాల మహానాడు (రాక్స్) జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ కోరారు. సోమవారం ఆయన బాధితులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. నాయకులు నడిపూడి రమణ, రంగా, కొప్పుల ప్రేమ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ గైగోలుపాడు ఉషోదయ మార్ట్ వద్ద 1.60 ఎకరాలు, విద్యుత్‌నగర్ వినాయకుడి గుడి ఎదురుగా 2.72 ఎకరాలు, వత్సవాయి సుబ్బరాజు కాలనీలోని 27 ప్లాట్లు, ఐదు బిల్డింగుల సెంటర్లో కొంత భూమిని ప్రభుత్వం నిషేధిత 22(ఎ) జాబితాలో చేర్చిందని, వాటిని తొలగించి రెవెన్యూ రికార్డుల్లో యథావిధిగా ఉంచాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరారు. సోమవారం వారు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సదరు స్థలాలను తాము 40 ఏళ్ల క్రితం కొనుగోలు చేసి నివాసం ఉంటున్నామన్నారు. ప్రస్తుత అవసరాలకు వాటిని విక్రయించుకుందామంటే ప్రభుత్వ నిషేధిత జాబితాలో ఉండడం వల్ల వీలు కావట్లేదన్నారు. తక్షణం ఆ జాబితా నుంచి తమ స్థలాలను తొలగించి న్యాయం చేయాలని ఇళ్ల యజమానులు పి.నాగమణి, వి.నరసింహరాజు, రామలింగరాజు, ఎస్ఎస్ఎస్ నాయుడు, ఈవీఎస్ చౌదరి, కె.గణేష్‌రావు, వి.నాగేంద్రరావు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన రాజేష్, యుగేష్, గణేష్

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మాధవపట్నం విద్యార్థుల ఎంపిక

సామర్లకోట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో ఆదివారం జరిగిన సౌత్‌జోన్ అథ్లెటిక్ స్టేట్ మీట్ ఎంపిక పోటీల్లో సామర్లకోట మండలం మాధవపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి డి.రాజేష్ వెయ్యి మీటర్ల పరుగులో ప్రథమ, ఎన్.యుగేష్ 400 మీటర్ల పరుగులో ద్వితీయ, ఆర్.పవన్‌గణేష్ జావెలిన్‌త్రోలో ప్రథమ స్థానాల్లో నిలిచారు. వీరు ముగ్గురూ బాపట్లలో ఈ నెల 9 నుంచి 11 వరకు జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారని ఎంఈవో శివరామకృష్ణయ్య, హెచ్ఎం టి.మురళీకృష్ణ తెలిపారు. విద్యార్థులను వారితో పాటు వ్యాయామోపాధ్యాయుడు ఎం.గోవిందు అభినందించారు.


అర్జీదారుల వద్దకే వెళ్లి వినతులు స్వీకరిస్తున్న పాడా పీడీ సత్యనారాయణ

పాడా పీజీఆర్ఎస్‌కు 74 వినతులు

పిఠాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్వీవీ సత్యనారాయణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ అంశాలపై 74 వినతులు అందాయి. ఏపీడీ వసంతలక్ష్మి, తహసీల్దారు పీవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో స్వప్న తదితరులు పాల్గొన్నారు.


పిఠాపురం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సెల్ ఫోన్లు అప్పగిస్తున్న ఐసీడీఎస్ కార్యకర్తలు

పని చేయని సెల్ ఫోన్లు మాకెందుకు

అధికారులకు అప్పగించిన అంగన్వాడీ కార్యకర్తలు

పిఠాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పనిచేయని సెల్‌ఫోన్లు తమకు వద్దంటూ అంగన్వాడీ కార్యకర్తలు వాటిని తీసుకువచ్చి పిఠాపురం ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం అప్పగించారు. అంతకు ముందు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. 2020లో ప్రభుత్వం 2జీ సెల్‌ఫోన్లు ఇచ్చిందని, ఇప్పుడు యాప్‌ల భారం పెరిగిపోవడంతో అవి పనిచేయట్లేదని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.పద్మ తెలిపారు. గర్భిణులు, బాలింతలను ఫేస్ యాప్‌లో రిజిస్టర్ చేయాలంటున్నారని, ఈ ఫోన్లతో అది సాధ్యం కాదని తెల్పి చెప్పారు. తమకు 5జీ ట్యాబ్‌లు ఇస్తే పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సంఘ నాయకులు విజయశాంత, బేబీరాణి, తులసి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): యాప్‌ల భారం తగ్గించాలని కోరుతూ ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఏపీ అంగన్‌వాడీ హెల్పర్స్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగన్వాడీలు సోమవారం ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాడి బేబీ, ఎస్తేరు రాణి మాట్లాడుతూ అంగన్వాడీలపై యాప్‌ల భారం మోపుతున్నారని, పనిచేయని ఫోన్లు ఇచ్చి తమను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయం వద్ద సెల్ ఫోన్లు విడిచి పెట్టి వెళ్లిపోయారు. ధర్నాలో యూనియన్ నేతలు నాగమణి, స్నేహలత, దేవి, పద్మ, విజయలక్ష్మి, సీఐటీయు నాయకుడు దారపురెడ్డి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

'పీ4లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలి'


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నిరుపేద కుటుంబాలను ఎంపిక చేసుకుని బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలన్నారు. ఆర్డీవో శ్రీరమణి మాట్లాడుతూ కుటుంబపరంగా ఆశించిన స్థాయిలో ఆర్థిక, ఆరోగ్య, విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి సాధించేంత వరకు వారికి చేయూతనివ్వాలన్నారు. తహసీల్దారు సీహెచ్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో శ్రీలలిత, పారిశ్రామికవేత్తలు మట్టే శ్రీనివాస్, బి.వెంకట కృష్ణారావు, వల్లూరి సూర్యప్రకాశరావు, శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


అండ్రంగిలో ప్రభుత్వ సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రం అందిస్తున్న మంత్రి సుభాష్

'సీఎం చంద్రబాబుతోనే స్వర్ణాంధ్ర సాకారం'

కాజులూరు (కరప), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే స్వర్ణాంధ్ర సాకారమవుతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా సోమవారం ఆయన కాజులూరు మండలం అండ్రంగిలో కూటమి నాయకులతో కలిసి పర్యటించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడారు. పలుచోట్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, నియోజకవర్గ పరిశీలకుడు కాకినాడ రామారావు, టీడీపీ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



కరపలో జలమయమైన కొత్తపేట ప్రధాన వీధి, నక్కావారి ఎస్సీ పేటలో నీట మునిగిన సీసీ రోడ్డు, డ్రైన్

కరపలో భారీ వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం
దెబ్బతిన్న వరి నాట్లు

కరప, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాగా ప్రధాన రహదారులు, వీధులు జలమయమయ్యాయి. డ్రైన్లు లేక ఉన్న డ్రైన్లకు అవుట్ లెట్‌లు లేక ముంపునీరు రోడ్లపై పొంగిపొర్లింది. ఎక్కడికక్కడ ముంపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కరప నక్కావారి ఎస్సీ పేటలోని సీసీ రోడ్లు, కరప-కొరుపల్లి ప్రధాన రహదారి, గ్రోమోర్ రోడ్లపై మోకాళ్ల లోతు నీరు నిలిచిపోయింది. కరప మండల పరిషత్ కార్యాలయం, కరప, గురజనాపల్లి, కూరాడ, వేళంగి, నడకుదురు, అరట్లకట్ట, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు హైస్కూళ్ల ప్రాంగణాలు, పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో వర్షం నీరు నిలిచిపోయింది. వేళంగి పీహెచ్‌సీ ఆవరణలో మోకాళ్ల లోతు నీరు చేరడంతో పేషెంట్లు ఇబ్బందిపడ్డారు. కొన్నిచోట్ల వరినాట్లు దెబ్బతిన్నాయి. ఈదురుగాలులు కూడా వీయడంతో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. కాగా గత కొద్ది రోజులుగా భరించలేని ఎండ, ఉక్కబోతతో అల్లాడిన జనం కుండపోతగా కురిసిన వర్షంతో సేదదీరారు.


గొల్లప్రోలులో కబ్జాకు గురైన మురుగునీటి కాలువ

మురుగునీటి కాలువ కబ్జా

గొల్లప్రోలు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని శివాలయం మాన్యం నుంచి పోలీసుస్టేషన్ వరకు గల మురుగునీటి కాలువ కబ్జాకు గురైందని, దీనివల్ల ఏలేరు కాలువలోకి మురుగునీరు చేరి పంట పొలాలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అడపా అర్జున్, కడారి తిరుపతిరావు, మొగలి జోగారావు, పడాల సత్యనారాయణ, కడారి రామ సూర్యనారాయణ తదితర రైతులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పట్టణంలో వాడిన మురుగునీరు పంటకాలువల్లోకి వస్తోందని, ఆక్రమణలు తొలగించాలని నగర పంచాయతీ కమిషనరుకు ఫిర్యాదు చేసినట్టు వారు చెప్పారు.

రేషన్ షాపుల తనిఖీ

గొల్లప్రోలు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలోని నెం.1, 9, 10, మండలంలోని ఎ.విజయనగరంలో నెం.34, దుర్గాడలోని నెం.32 చౌక ధరల దుకాణాలను పౌరసరఫరాల శాఖ ఏఎస్‌వో ప్రసన్నలక్ష్మి సోమవారం తనిఖీ చేశారు. మొబైల్ యాప్ ద్వారా సరుకుల పంపిణీ, స్టాకు వివరాలను పరిశీలించారు. కార్డుదారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. స్టాకు, రికార్డుల్లో నిల్వలు సరిపోయాయని ఏఎస్‌వో చెప్పారు.

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా నేడు ధర్నా

కొత్తపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కరెంటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసి స్తూ మంగళవారం మండలంలోని విద్యుత్ కేంద్రం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీముక్తి) జిల్లా కమిటీ ప్రతినిధులు కోరారు. సోమవారం వారు మండలంలోని వివిధ గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. జిల్లా నాయకురాలు రెడ్డి దుర్గాదేవి, గెడ్డం చిట్టెమ్మ, భూషణం, అన్నవరం, రాజమ్మ పాల్గొన్నారు.

పీఆర్ వృత్తి విద్యా కళాశాల అభివృద్ధికి నా వంతు సహకారమందిస్తా: ఎమ్మెల్యే వనమాడి


నూతన భవనం ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారమందిస్తానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. ఏఎఫ్ఎస్ నిధులు రూ.80లక్షలతో నాలుగు తరగతి గదులతో నిర్మించిన నూతన భవనాన్ని సోమవారం ఆయన విద్యా శాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్సీ గోపీమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం కళాశాలకు ఏం కావాలో రాతపూర్వకంగా తెలిపితే ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు. మాజీ ప్రిన్సిపాల్ ఎం.తిరుపతిని డీఐఈవో ఐ.శారద సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.రాజేంద్రప్రసాద్, పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతుల రాంబాబు, పైడా ట్రస్టు చైర్మన్ వెంకటనారాయణ, డీఈ జయకర్, ఏఈ వెంకటరాజు, ఎన్ఎస్ఎస్ అధికారులు పీవీ శివప్రసాద్, కె.నిరంజన్‌కుమార్, అధ్యాపకులు, టీడీపీ నాయకుడు మల్లిపూడి వీరు పాల్గొన్నారు.

పనులు తెలిపే బోర్డులు లేవు

గుర్తించిన ఉపాధి హామీ ఆడిట్ బృందం

తాళ్లరేవు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పోలేకుర్రు పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన కాంపౌండ్ మెటీరియల్స్, కూలీలు చేసే ఫీల్డ్ వర్క్ వద్ద వివరాలు తెలిపే బోర్డులను ఎక్కడా ఏర్పాటు చేయలేదని ఆడిట్ బృందం గుర్తించింది. పని ప్రదేశం వద్ద కూలీలకు కనీస సౌకర్యాలైన గూడు, నీడ, ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలు కూడా లేనట్టు గుర్తించింది. కొన్నిచోట్ల కూలీలు పనిచేసినా మస్తర్లు వేయలేదని, మస్తర్లను దిద్దారని, 28 మొక్కలు మిస్సయ్యాయని గుర్తించారు. పంచాయతీలో 514 పింఛన్లు సక్రమంగానే అందుతున్నాయన్నారు. సామాజిక తనిఖీ గ్రామసభలో సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, మాజీ సర్పంచ్ దడాల బుజ్జిబాబు, మాజీ చైర్మన్ వుంగరాల వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయనిర్మల, ఎస్సార్పీ సత్యనారాయణ, డీఆర్పీ సత్తిబాబు, గ్రామసభ పరిశీలకురాలు డాక్టర్ శుభశ్రీ, ఉపాధి ఇంజనీర్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ పంతగడ కిరణ్‌కుమార్, ఉపాధి మేట్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కుటేశ్వర స్వామికి విశేష పూజలు

పిఠాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం దశమి, ఏకాదశి సందర్భంగా పాదగయ క్షేత్రంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పుష్కరిణిలో స్నానాలు చేసి కుక్కుటేశ్వర స్వామికి అభిషేకాలు జరిపారు. స్వామిని సాయంత్రం విశేషంగా అలంకరించారు. రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లకు కుంకుమార్చనలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): కుమారరామ భీమేశ్వరాలయంలో ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న వేద మంత్రోచ్చారణలతో స్వామివారిని పంచద్రవ్యాలతో అభిషేకించారు. బాలా త్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన, విశేష పుష్పార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేష అలంకారం జరిపారు.

సినారెకు నివాళి

తాళ్లరేవు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ రచయిత, విప్లవ కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతిని ఆయన అభిమాని వుంగరాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలేకుర్రులో సోమవారం ఘనంగా నిర్వహించారు. సినారె చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు అభిమానులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ సీపీఎం ధర్నా

పిఠాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని పాడా కార్యాలయం వద్ద సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. స్మార్ట్ మీటర్లు బిగించిన వారికి ఇప్పటికే అధికంగా బిల్లులు వస్తున్నాయని నాయకులు తెలిపారు. దీంతో ప్రజలపై మోయలేని భారం పడుతోందని చెప్పారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఎవరైనా వస్తే వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఆందోళనలో సీపీఎం జిల్లా నాయకుడు దువ్వా శేషుబాబ్జీ, నాయకులు కోనేటి రాజు, కె.నాగేశ్వరరావు, కరణం విశ్వనాథం, జి.వీరబాబు, వీఎస్ రెడ్డి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడండి'

తాళ్లరేవు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గాడిమొగ పంచాయతీ చినవలసల మహాలక్ష్మమ్మ అమ్మవారి జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత గ్రామపెద్దలదేనని కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కోరింగ ఎస్ఐ సత్యనారాయణ సోమవారం చినవలసల గ్రామాన్ని సందర్శించారు. గ్రామ పెద్దలతో మాట్లాడుతూ కొందరిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని, అమ్మవారి గుడి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

సామర్లకోట రైల్వే స్టేషన్లో స్వచ్ఛత అభియాన్

సామర్లకోట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత అభియాన్‌లో భాగంగా రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలోని అన్ని విభాగాలతో పాటు, రైల్వే కాలనీని రైల్వే సిబ్బంది, పలు శాఖల ఉద్యోగులు సోమవారం పరిశుభ్రం చేశారు. పలుచోట్ల బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్, కళ్యాణి, రామకృష్ణ, అనంతలక్ష్మి, చైతన్య, రమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో శక్తిపీఠాల ప్రతిష్ఠాపన

కిర్లంపూడి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో శ్రీకనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో సోమవారం సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్ ఆధ్వర్యంలో ఆలయకమిటీ సభ్యులు నేతృత్వంలో 18 శక్తిపీఠాలు ప్రతిష్ఠించారు. ఆలయంలో మహా చండీహోమం, గణపతి హోమం నిర్వహించారు. జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ బండారు ప్రసాద్, వైస్ సర్పంచ్ రేపూరి శ్రీను, సతిరాజు, పొడుగు నరసింహం పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 64 అర్జీలు

రంపచోడవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 64 అర్జీలను ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం స్వీకరించారు. గ్రామాలకు సీసీ, బీటీ రోడ్లు ఏర్పాటు చేయాలని, పాఠశాల భవనాలకు మరమ్మతు పనులు చేపట్టాలని, సాగునీరు ఏర్పాటుకు త్రీఫేస్ విద్యుత్ ఏర్పాటుచేయాలని కోరుతూ తమ ఫిర్యాదులను పీవోతో పాటు ఐటీడీఏ ఏపీవో(జీ) డీఎన్వీ రమణకు అందించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేద్కర్, డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏపీడీ బి.సత్యనారాయణ, డేగలయ్య, ఈఈలు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, సుబ్బయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'తల్లిపాలు శిశువుకు సంపూర్ణ ఆహారం'

తల్లిపాలు శిశువుకు శ్రేష్ఠమని, మొదటి ఆరు నెలలపాటు తల్లిపాలు మాత్రమే శిశువుకు సంపూర్ణ ఆహారమని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి ఐటీడీఏ పీవో, సబ్‌కలెక్టర్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. తల్లి గర్భం నుంచి పుట్టిన ప్రతిబిడ్డకు తల్లిపాలు ఇచ్చి వ్యాధుల నుంచి కాపాడుకోవాలని సూచించారు. అనంతరం చీర, పసుపు, కుంకుమ, గాజులు ఇచ్చి గర్భిణులకు సీమంతం చేశారు. ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, ఏడీఎంహెచ్‌వో డేవిడ్, వైద్యాధికారిణి జి.శిరీష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కుసుమ, వెంకటలక్ష్మి, జయలక్ష్మి, రాఘవ, గౌతమి, అమ్మాజీ, రామలక్ష్మి, వైద్య ఆరోగ్య శాఖాధికారులు బి.మార్గదర్శి, ఎ.ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

ఆసుపత్రులలో మెరుగైన వైద్యసేవలు అందించాలి

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు సత్వరమే స్పందించి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో వైద్యఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు రక్త నమూనాలు స్వీకరించి ఆయా వ్యాధులకు మందులు అందజేయాలన్నారు. వైద్యాధికారులు పనివేళల్లో అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యసేవలు అందించాలన్నారు. మలేరియా ప్రబలకుండా మలేరియా దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేయాలన్నారు. సమావేశంలో ఏడీఎంహెచ్‌వో డేవిడ్, వైద్యాధికారిణి జి.శిరీష, డీఎంవో జ్ఞానశ్రీ, శ్రీనివాసరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

'నిర్వాసితులకు ఇంటి స్థలాలను చూపించండి'

వీఆర్‌పురం, అగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అల్లూరిజిల్లా చింతూరు డివిజన్ వీఆర్‌పురం మండల పరిధిలోని రాజుపేట, రాజుపేటకాలనీలకు చెందిన గిరిజనేతర పోలవరం నిర్వాసితులకు తాడువాయిలోని ఇళ్ల స్థలా లను చూపించేందుకు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ మంగళవారం తీసుకువెళతామని ఒక ప్రకటనలో తెలిపారు. గతంలోనే పోలవరం నిర్వాసితుల కోసం ఎంపికచేసి, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలను నిర్మించే ందుకు సిద్ధంగా ఉన్న ఇళ్ల స్థలాలను చూపించేందుకు రెండు బస్సులు ఏర్పాటుచేసి తీసుకవెలుతున్నామన్నారు. అక్కడ స్థలాలను చూసిన తరువాత నిర్వాసితులు అభిప్రాయాలను జిల్లా కలెక్టర్‌కు పంపుతామన్నారు.

భార్య చేతిలో గాయపడిన భర్త మృతి

మారేడుమిల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భార్య చేతిలో గాయపడి చికిత్స పొందుతూ భర్త మృతి చెందిన సంఘటన మారేడుమిల్లి మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని డీపీ కోట పంచాయతీ వైదిపూడి గ్రామానికి చెందిన నాయిని సోమిరెడ్డి (52) భార్య లక్ష్మి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జూన్ 3వ తేదీన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా వీరిద్దరి మధ్య ఘర్షణ ఏర్పడి భర్తను భార్య లక్ష్మి కర్రతో బలంగా కొట్టింది. గాయపడిన అతన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ జూన్ 6న సోమిరెడ్డి మృతి చెందాడు. దీనిపై కేసు నమోదుచేసిన పోలీసులు సీఐ నరేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిందితురా లు లక్ష్మిని సోమవారం అరెస్ట్‌చేసి కోర్టుకు తరలించగా జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పార్టీకి కష్టపడిన వారికే పదవులు: ఎమ్మెల్యే శిరీషాదేవి

దేవీపట్నం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికే పదవులు దక్కుతాయని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి అన్నారు. సోమవారం మండలంలో ఇందుకూరుపేట పార్టీ కార్యాలయంవద్ద మండల అధ్యక్ష ఎన్నికకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ పరువును దిగజార్చేలా సామాజిక మాధ్యమాల్లో సందేశాలకు స్వస్తి పలకాలని, వ్యక్తిగత విషయాలు ఏమైనా ఉంటే మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని తెలిపారు. అనంతరం అభ్యర్థులుగా నిలిచిన మారిశెట్ల వెంకటేశ్వరరావు, గోళ్ల చంటిబాబు ఇద్దరిలో ఒకరిని ఏకగ్రీవం చేసేలా ప్రతిపాదనలు చేసినప్పటికీ అభ్యర్థులు ఇద్దరు ఎన్నికలకు వెళ్లడంతో కార్యకర్తలకు నిరాశ ఎదురైంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, మాజీ మండల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ తోటలతో గిరిజనుల ఆర్థికాభివృద్ధి

అడ్డతీగల, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): పామాయిల్ తోటల పెంపకంతో గిరిజనులు ఆర్థికాభివృద్ధి పొందాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి రైతులకు సూచించారు. సోమవారం పతాంజలి ఫుడ్స్‌పామ్ ప్లాంటేషన్ వారి ఆధ్వర్యంలో కోనలోవ గ్రామంలో బుర్లె హరిబాబు తోటలో పతాంజలి గ్రూప్ డీజీఎం ప్రకాష్ అధ్యక్షతన పామాయిల్ తోటల విస్తరణ మహోత్సం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే శిరీషాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు ఉచితంగా పామాయిల్ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాయితీ మొత్తం రూ.123కోట్ల నిధులు విడుదల చేసిందని గర్వంగా తెలిపారు. పతాంజలి గ్రూప్ డీజీఎం ప్రకాష్ మాట్లాడుతూ ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతంలో రెండువేల ఎకరాలలో ఈ పంటను సాగు చేస్తున్నారన్నారు.అనంతరం ఉత్తమ రైతుగా ఎంపికైన రామాంజనేయ రాజును ఎమ్మెల్యే శిరీషదేవి, అధికారులు సత్కరించారు.

మల్టీ స్పెషాల్టీ పనులకు స్థల పరిశీలన

మోతుగూడెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో మల్టీస్పెషాల్టీ పనులకు కేటాయించిన ఎకరం స్థలాన్ని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వీవీ లక్ష్మీనారాయణ సోమవారం పరిశీలించారు. ఈ స్థలం రహదారి, కరెంట్, మం చినీరు, వాడుకనీరు, కమ్యూనికేషన్ సదుపాయాలకల్పనకు అనుకూలంగా ఉందని సంతృప్తి చెందారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌దొర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చలమ య్య, ఐటీడీఏ ఏఈ తరుణ్, డిప్యూటీ ఎంపీ డీవో మోహన్‌రావు పాల్గొన్నారు.

మహిళల్లో హైందవ చైతన్యం తీసుకురావడమే ధ్యేయం

రంపచోడవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మహిళా మూర్తుల్లో హైందవ చైతన్యం తీసుకురావాలనే సంకల్పంతో బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమం నిర్వహిస్తున్నామని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షు డు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక భాను కళ్యాణ మండపంలో నిర్వహించిన బంగారు వరలక్ష్మి కానుక-3 లక్కీ డ్రా కార్యక్రమం నిర్వహించారు. లక్కీ డ్రాలో గెలుపొందిన 70మంది మహిళలకు బంగారు రూపులను శ్రీనివాసరావు దంపతులు పంపిణీ చేశారు.

సమస్యలు పరిష్కరించండి

చింతూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండ ల కేంద్రమైన చింతూరులో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని జనసేన మండ ల అధ్యక్షుడు మడివి రాజు కోరారు. సోమ వారం ఎంపీడీవో శ్రీనివాస్‌దొరకు వినతి పత్రం అందజేశారు. రహదారులు బురదమయం, దోమల బెడద, వీధిలైట్లు లేక అవస్థలు, డ్రైనేజీలు చెత్తా, చెదారంతో దుర్గంధం వెదజల్లుతోందని ఎంపీడీవో దృష్టికి మడివి రాజు తీసుకెళ్లారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

టీడీపీ మండలాధ్యక్షుల ఏకగ్రీవ ఎన్నిక


అధ్యక్షులను అభినందిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ, జ్యోతుల నవీన్‌కుమార్

జగ్గంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇర్రిపాకలోని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్వగృహంలో సోమవారం టీడీపీ జగ్గంపేట నియోజకవర్గం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పార్టీ సంస్థాగత ఎన్నికలు జరిగాయి. టీడీపీ జగ్గంపేట మండల అధ్యక్షుడిగా జగ్గంపేటకు చెందిన జీను మణిబాబు, గండేపల్లి మండల అధ్యక్షుడిగా సింగంపాలేనికి చెందిన పోతుల మోహనరావు, కిర్లంపూడి మండల అధ్యక్షుడిగా భూపాలట్నానికి చెందిన వీరం రెడ్డి రామలింగేశ్వరరావు (కాశిబాబు), గోకవరం మండల అధ్యక్షుడిగా వెదురుపాక చెందిన పిల్ల అర్జునసారధి (చంటిబాబు)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈఅవకాశం కల్పించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన అధ్యక్షులను పలువురు సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక చేయూత

ప్రత్తిపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చినశంకర్లపూడిలో అగ్నిప్రమాద బాధితులకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు ఆర్థిక చేయూతనందించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆరు తాటాకిళ్లు దగ్ధమై ఆరు నిరుపేద కుటుంబాల వారు నిరాశ్రయులైన విషయం తెలిసిందే. బుర్రే మణెమ్మ, పులకపు సత్తిబాబు, పిరాటి అప్పన్నమానూరి రాజబాబు, ముతకల నాగేశ్వరరావు, పిరాటి అచ్చారావు కుటుంబాలను సోమవారం ముదునూరి పరామర్శించారు. బాధితులు ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున రూ.60వేలు అందజేశారు.

టీడీపీ గండేపల్లి మండలాధ్యక్షుడిగా మోహనరావు



గండేపల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా పోతుల మోహనరావు మరోసారి ఎంపికయ్యారు. ఆయన్ను నియమిస్తూ జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సోమవారం ప్రకటించారు. మోహనరావు మాట్లాడుతూ తనను పార్టీ మండలాధ్యక్షుడిగా ఎంపిక చేసిన అధిష్టానానికి, ఎమ్మెల్యే నెహ్రూకు కృతజ్ఞతలు తెలిపారు. మోహనరావుకు నాయకులు శుభాకంక్షలు తెలిపారు. టీడీపీ నాయకుడు జాస్తి వసంత్ తదితరులు ఉన్నారు.

అన్నక్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

జగ్గంపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్డులోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నక్యాంటీన్‌లో సోమవారం జగ్గంపేటకు చెందిన పుర్రె బుచ్చన్న జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు మారిశెట్టి భద్రం, వెంట్రప్రగడ శ్రీరామమూర్తి, వేములకొండ జోగరావు, దాపర్తి సీతారామయ్య, బొండా రాజేష్, పుర్రె వెంకటేశ్వర్లు, పుర్రె వీరసత్యనారాయణ, పుర్రే సూరన్న, పుర్రే అర్జునరావు, చిక్కాల గొల్లబాబు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు కల్పించాలి

ధర్మవరం గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద నిరసన

ప్రత్తిపాడు ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో సర్వే నెం,431, 762, 776,777ల్లో ఉన్న మాదిగ నౌకరీ ఈనాం భూములపై తమకు భూయాజమాన్య హక్కులు కల్పించాలని గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా గంగరాజు మాట్లాడుతూ పిఠాపురం మహారాజా కాలంలో తమ పూర్వీకులకు మాదిగ నౌకరీ ఈనాం భూముల కింద వీటిని సాగు చేసుకోవడానికి ఇచ్చారన్నారు. అయితే ఈ భూములను కొందరు కబ్జాకు ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. తమకు వారసత్వంగా సంక్రమించిన ఈ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఆన్‌లైన్ చేసి భూ యాజమన్య హక్కులు కల్పించాలని కోరారు. చర్యలు తీసుకోవాలని ప్రత్తిపాడు రెవెన్యూ అధికారులను కోరినా స్పందించలేదని చెప్పారు.

కూటమి ప్రభుత్వంలో లారీ ఓనర్లకు మేలు


కత్తిపూడిలో కూటమి నేతలకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

శంఖవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ట్యాక్స్ వల్ల ఎంతోమంది లారీ యజమానులు ఆర్థికంగా నష్టపోయేవారని కూటమి ప్రభుత్వం వచ్చాక వారందరికీ ఊరటనిచ్చారని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. కత్తిపూడి లారీ ఓనర్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొ ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, జిల్లా లారీ యూనియన్ అధ్యక్షుడు, దుగ్గిన నాగరాజు, కత్తిపూడి అధ్యక్షుడు గౌతు కన్నారావు, టీడీపీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు, వెన్నా ఈశ్వరుడు, ఉల్లి వీరభద్రరావు, కీర్తి వెంకటసుభాష్, యర్రంశెట్టి బాబ్జీ, గౌతు నాగు, గౌతు అర్జిబాబు, సాదనాల లక్ష్మీబాబు, ట్రెజరర్ అశోకమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు ఆరోగ్యదాయకం


ధర్మవరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ

ప్రత్తిపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలు ఎంతో ఆరోగ్యదాయకమని ప్రత్తిపాడు ఐసీడీఎస్ సీడీపీవో టీడీఆర్ పద్మావతి, ప్రత్తిపాడు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య చెప్పారు. తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా సోమవారం ధర్మవరం, ప్రత్తిపాడు గ్రామాల్లో ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బంది తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ ర్యాలీలు నిర్వహించారు. పద్మావతి, సౌమ్య మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డలకు ఇవ్వడం వల్ల ప్రసవానంతర రక్తస్రావం తగ్గడంతో పాటు గర్భాశయం సాధారణ స్థితికి రావడానికి దోహదపడుతుందన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ వెలుగుల నాని, అంగన్‌వాడీసూపర్‌వైజర్లు వరలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

ధర్మవరంలో తాగునీటి కష్టాలు


ధర్మవరంలో పని చేయని మంచినీటి పథకం

ప్రత్తిపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో ఒకటో వార్డులో మళ్లీ తాగునీటి కష్టాలు నెలకొన్నాయి. గత వేసవి ఎండల్లో తీవ్ర మంచినీటి ఎద్దడి ఎదుర్కొన్న ఈగ్రామంలో రూ.60లక్షలతో పైపులైన్ విస్తరణ, తాగునీటి ట్యాంకుల అభివృద్ధి పనులు నిర్వహించారు. ఇప్పటి వరకు సజావుగా పని చేసిన మంచినీటి పథకాలు మూడు రోజుల నుంచి సక్రమంగా పని చేయడం లేదు. ఒకటో వార్డులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.లక్షతో నిర్మించిన జీఎల్ఆర్ ట్యాంక్ ఎనిమిది నెలలుగా పని చేయడం లేదు. సొసైటీ కార్యాలయం, గంగాలమ్మ ఆలయాలు వద్ద ఉన్న చేతి పంపులకు మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలివేశారు. అధికారులు స్పందించి తాగునీటి కష్టాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

గురుకుల కళాశాలలో 23 సీట్లు ఖాళీ

తునిరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వి.కొత్తూరు అంబేడ్కర్ ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఎంఈసీ గ్రూపులో 23సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి తెలిపారు. ఎస్సీ-1లో 2, ఎస్సీ-2లో 7, ఎస్సీ-3లో 7, బీసీలో 2, బీసీ సీలో 5 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. వివరాలకు 9704551118, 8074079227లో సంప్రదించాలని కోరారు.

రౌతులపూడి ఎంఈవోగా సతీష్



రౌతులపూడి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి ఎంఈవో1గా కె.సతీష్ బాబు నియమితు లయ్యారు. సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎంఈవో-2 గాడి కొండబాబు, ప్రధానో పాధ్యాయుడు కోళ్ల రాంబాబు, యూటీఎఫ్ నాయ కులు అచ్చిరాజు, జి.నాగరాజు, రామచంద్రరావు, ఆర్‌వీఆర్ మూర్తి, తాత బాబు ఎంఈవో-1ను మర్యాద పూర్వకంగా కలిశారు.

ముద్రగడ కోలుకోవాలని పూజలు

ప్రత్తిపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కోలుకోవాలని కోరుతూ సోమవారం ఎరకంపాలెం ధారా మల్లికార్జున స్వామి ఆలయం వద్ద అభిమానులు, కార్యకర్తలు సోమవారం స్వామి, అమ్మవార్లకు ప్రదోష కాల పూజలు నిర్వహించి అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. రమణ మహర్షి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. రామిశెట్టి నాని, లొండా బాబులు, దేవ లక్ష్మణ్, తుంపటి శ్రీను, తుట్ట గోవింద, బొడ్డి చిన్న, అడబాల బాబ్జి పాల్గొన్నారు.

కొత్తూరు సర్పంచ్ రామస్వామి మృతి



శంఖవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కొంతంగి కొత్తూరు సర్పంచ్ దూళ్ల రామస్వామి (67) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో విశాఖపట్నం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం ఉదయం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమార్తె నెల్లిపూడికి గ్రామ సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. ఆయన మృతి పట్ల పలుగ్రామాల సర్పంచ్‌లు, నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

నేడు ఎమ్మెల్యే సత్యప్రభ పర్యటన

రౌతులపూడి, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మంగళవారం రౌతులపూడిలో పర్యటిస్తారని టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ తెలిపారు.సొసైటీఅధ్యక్షుడు పైడిరాజు ప్రమాణ స్వీకారానికి హాజరై అనంతరం రౌతులపూడి, ఎ.మల్లవరం గ్రామాల్లో డ్రోన్లను రైతులకు అందిస్తారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రంపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న మల్లేపల్లి గ్రామానికి, గండేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గండేపల్లి, సింగరంపాలెం, రామయమ్మపాలెం గ్రామాలకు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు, ఏఈ కిరణ్‌కిషోర్ పేర్కొన్నారు. మరమ్మతులు, నూతన సబ్‌స్టేషన్ నిర్మాణ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వారు తెలిపారు.

సారా స్వాధీనం..ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించి 90 లీటర్ల సారాతో ఆటోను సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. కంబాలపాలెం ఎర్రవరం రహదారి మార్గంలో ఆటోపై 90 లీటర్ల సారా రవాణా చేస్తున్న చిన్న శంకర్లపూడి, భద్రవరం గ్రామస్తులు పొన్నాడ ఏసుబాబు, నామ సత్యనారాయణను అరెస్ట్ చేశారు. వారికి సారా తయారీకి అవసరమైన నల్లబెల్లాన్ని సరఫరా చేస్తున్న పెద్దనాపల్లి గ్రామానికి చెందిన కోడెల రాంబాబుపై కేసు నమోదు చేశారు. తోటపల్లి గ్రామంలో ఐదు లీటర్ల సారాతో గిట్ల తులసిని అరెస్ట్ చేశారు. దాడుల్లో సీఐ పి.శివప్రసాద్, ఎస్ఐ వంశీరాం, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా

జగ్గంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచినట్టు సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని అన్నారు.

బెనబాబుకు మదర్ థెరిస్సా పురస్కారం

అన్నవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనే పదిలం బెనబాబు మదర్ థెరిస్సా బుక్ ఆఫ్ ఇండియా ప్రైడ్ పురస్కారం అందుకున్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన వెల్‌రెడ్ ఫౌండేషన్ ఈ పురస్కారం అందించింది. గతంలో ఆయన 1993లో కోల్‌కతాలో మదర్‌థెరిస్సా ఆశ్రమంలో ఆమెతో కలసి కుష్ఠువ్యాధిగ్రస్థులకు సేవలందించడంతో పాటుగా మదర్‌థెరిస్సా నుంచి పురస్కారం అందుకున్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఏడుగురి అరెస్టు

కిర్లంపూడి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో డ్రంకన్ డ్రైవ్‌లో ఏడుగురిని అరెస్టు చేసినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. వారిని సోమవారం ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరచగా నలుగురికి 3రోజుల జైలు, ముగ్గురికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారన్నారు.


తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న సీడీపీవో పూర్ణిమ

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం

కిర్లంపూడి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవరం, కిర్లంపూడి పీహెచ్‌సీలో సోమవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో ఎం.పూర్ణిమ హాజరై తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు హేమాంజలి, స్వాతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బూసమ్మ, చంద్రకళ, సిబ్బంది ఉన్నారు.

ఉలిగోగులకు 7న కలెక్టర్ రాక

ప్రత్తిపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తైన కొండలపై ఉన్న ఉలిగోగుల గిరిజన తండాను ఈనెల 7న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సందర్శించనున్నారు. తండాలో అంగన్‌వాడీ సెంటర్ లేకపోవడం, పాఠశాల భవనం మరమ్మతులతో ఉండడం, తాగునీరు, లోవోల్టేజీ, రహదారి సమస్యలతో సతమతమవుతున్నామని ఆ గ్రామ గిరిజనులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ గురువారం ఉలిగోగుల సందర్శించనున్నారని స్థానిక ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు.

అరుణాచలేశ్వర ఆలయంలో పూజలు

ప్రత్తిపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాచపల్లిలోని అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పలు పూజలు నిర్వహించారు. శ్రావణ సోమవారం సందర్భంగా అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరుడు, నందీశ్వరుడులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు రమణానందస్వామి ఆధ్వర్యంలో వీటిని నిర్వహించి పంచ హారతి ఇచ్చారు.

ఆంగ్లంపై పట్టు అవసరం

గండేపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీకి చెందిన బీటెక్ సీఎస్ఈ బ్రాంచ్‌కి చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో యూనివర్శిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ఆంగ్లం భాషపై పట్టు అవసరం అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.


ప్రత్తిపాడులో తల్లికి వందనం అమలు కాక ఇబ్బంది పడుతున్న మహిళలు

'తల్లికి వందనం' రాలేదు

ప్రత్తిపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం మంజూరు కాక ఒమ్మంగికి చెందిన ఇద్దరు మహిళలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారు. ఒమ్మంగికి చెందిన వర్దనపు దుర్గాభవానికి ముగ్గురి పిల్లలు. వారిలో ఒకరైన నరేష్‌బాబుకు పథకం మంజూరు కాలేదు. ఒమ్మంగికి చెందిన కంచెర్ల నూకాలమ్మ మనువరాలు నందినికి తల్లికి వందనం మంజూరు కాలేదు. విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.

సహకార సంఘాల బలోపేతానికి చర్యలు

ఎమ్మెల్యే సత్యప్రభ


ఏలేశ్వరం పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. సోమవారం స్థానిక వేంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. పీఏసీఎస్ చైర్మన్‌గా నూతి బూరయ్య, డైరెక్టర్‌గా వైబోగుల సుబ్బారావు, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యేను వారు సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అలమండ చలమయ్య, మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జనసేన నాయకులు మేడిశెట్టి సూర్యకిరణ్, ఎంపీటీసీలు పసల సూరిబాబు, పలివెల వెంకటేశ్వరరావు, కోరుకొండ శ్రీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం సమకూర్చుకుని అభివృద్ధి పనులు చేపట్టాలి

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల

తునిరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆదాయ వనరులు సమకూర్చుకుని అభివృద్ధి పనులు చేపట్టాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. స్థానిక పాతబజారు వీధి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సోమవారం కొలువుదీరింది. సీనియర్ నేత కుక్కడపు బాలాజీ నేతృత్వంలో టీడీపీ పట్టణ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి అధ్యక్షతన దేవస్థానం ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, అతిథిగా మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు హాజరై వ్యాపారవేత్త చక్కా తాతబాబు, కూటమి నాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. యనమల సమక్షంలో దేవస్థానం పాలకవర్గ చైర్మన్‌గా కుక్కడపు బాలాజీ, సభ్యులుగా దర్బా శ్రీనివాస్, ఉమ్మిడి వెంకటరమణ, చల్లకొండ సత్యసుధాకర్, వీవీఎస్ బీబీ సీతారామరాజు, పురివండ శ్రీనివాసశాంతి, మచ్చా రమ్య, బోడపాటి నాగమణి, సానపల్లి రమణమ్మ, ముడుంబా భాస్కరాచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇనుగంటి సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల గణేష్ పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న బోర్డు సభ్యులు

అంగన్‌వాడీల ఆందోళన

తునిరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు అందించిన సెల్‌ఫోన్లు పనిచేయడం లేదని సోమవారం తుని ప్రాజెక్టు అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ధనలక్ష్మి, ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. తుని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి సెల్‌ఫోన్లు అందించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఫోన్లు పనిచేయక ఇబ్బందులు పడుతున్నామని తక్షణం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి కొత్త ఫోన్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్.శ్రీనివాస్ కామేశ్వరి, సుబ్బలక్ష్మి, శాంతకుమారి, రాణి, లలితకుమారి, ఇందిర ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు